

పరిశీలన పూర్తి

రంగంలో 105 మంది అభ్యర్థులు - పార్లమెంటుకు 21, అసెంబ్లీకి 84

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ముఖ్యమైన నామినేషన్ల పరిశీలన ఘట్టం శుక్రవారంతో ముగిసింది. పార్లమెంటు స్థానానికి 56, ఏడు అసెంబ్లీ స్థానాలకు 254 నామినేషన్లు అందాయి. శుక్రవారం జరిగిన పరిశీలన ప్రక్రియ అనంతరం బరిలో మొత్తం 105 మంది అభ్యర్థులు మిగిలారు. వీరిలో పార్లమెంటు స్థానానికి 21మంది, అసెంబ్లీ స్థానాలకు 84 మంది ఉన్నారు. నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి.

అసెంబ్లీ నియోజకవర్గం	అభ్యర్థులు వేసిన నామినేషన్లు	తిరస్కరణకు గురైన నామినేషన్లు	ఆమోదం పొందిన నామినేషన్లు
పుంగనూరు	15	05	10
నగరి	24	17	07
గంగాధరనెల్లూరు	21	09	12
చిత్తూరు	21	07	14
పూతలపట్టు	19	07	12
పలమనేరు	19	05	14
కుప్పం	18	03	15
మొత్తం	137	53	84
● చిత్తూరు ఎంపీ స్థానం	35	14	21

నామినేషన్ల తిరస్కరణలో పదనిసలు

● కుప్పంలో 'చిల్లర' నాణేలను డిపాజిట్‌గా చెల్లించి స్వతంత్ర అభ్యర్థిగా వెంకటరామిరెడ్డి పార్థసారధిరెడ్డి వేసిన నామినేషన్ తిరస్కరణకు గురైంది. పది మంది ప్రతిపాదితుల సంతకాలను ఒక్కరే పెట్టినట్లు తేల్చారు.

● కొన్ని నామినేషన్లలో 10 మంది ప్రతిపాదకులకు బదులుగా 9 మంది సంతకాలే ఉండటం, కొన్నింటిలో ప్రపాదించాల్సిన వ్యక్తుల సంతకాలే లేకపోవడంతో తిరస్కరించారు. పలువురు అభ్యర్థులు నామినేషన్లలో గడులు నింపక పోవడం, కొందరు ప్రతిపాదితుల సంతకాలు వేర్వేరు రీతిలో ఉండటంతో అవన్నీ తప్పుడివి తేలడంతో తిరస్కరణకు గురయ్యాయి. ఇలాంటి వాటిలో ఎక్కువగా స్వతంత్ర అభ్యర్థులవే ఉన్నాయి.

● కొన్ని పార్టీల తరపున డమ్మీలుగా వేసిన వారు ఏ, బీ ఫారాలు అందించకపోవడంతో నామినేషన్లు తిరస్కరించారు.

● చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా జాతీయ జనసేన పార్టీ తరపున నామినేషన్ వేసిన దుగ్గిరాల నాగేశ్వరరావు ప్రతిపాదకులను ప్రత్యక్ష పరిశీలన కోసం ఆర్వో కార్యాలయానికి తీసుకురావాలని మూడు గంటల వ్యవధి ఇచ్చారు. అయినా తీసుకుని రాకపోవడంతో అతడి నామినేషన్‌ను తిరస్కరించారు.

● చిత్తూరు అసెంబ్లీకి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున నామినేషన్ వేసిన సి.రాజ ఓటరు జాబితా సర్టిఫైడ్ కాపీ జతపరచకపోవడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఇలా చిన్న చిన్న కారణాలతోనే చాలావరకు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి.

- చిత్తూరు కలెక్టరేట్

ఉపసంహరణకు ఆదివారం సెలవు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారంతో ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. 27, 29 తేదీల్లో నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం అన్ని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో జరుగుతుందన్నారు. 28వ తేదీ ప్రభుత్వ సెలవు దినం కనుక ఆ రోజు ఉపసంహరణ ప్రక్రియ ఉండదని పేర్కొన్నారు. ఉపసంహరించుకోదలచిన వారు స్వయంగా లేదా అభ్యర్థి ధ్రువీకరణ పత్రంలో పేర్కొన్న ప్రతిపాదకుల ద్వారా లేదా ఎన్నికల ఏజెంట్ల ద్వారా సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందించాలని సూచించారు.

ఉల్లంఘనల సమాచారం ఇవ్వండి

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26: ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు ఆర్ అండ్ బీ అతిథిగృహంలో అందుబాటులో ఉంటారని, రోజూ సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు అర్జీలు స్వీకరిస్తారని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల అభ్యర్థులు ఫిర్యాదులు కానీ, సమాచారం కానీ ఇవ్వవచ్చుని చెప్పారు.

● చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు శంకర్‌ప్రసాద్ శర్మ (సెల్: 9281448308)

● నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్ కైలాష్ వాంఖే (సెల్: 9281448305)

● చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్ ఎంటీ షాదిక్ అలామ్ (సెల్: 9281448302)

● పుంగనూరు, నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకుడు ఎస్.శ్రీనివాస్ ఖన్నా (సెల్: 9281448307)

● చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకుడు రోహన్ ఠాకూర్ (సెల్: 9281448306).

రేపు జడ్పీలో ఎన్నికల సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26: స్థానిక జిల్లాపరిషత్ మీటింగ్ హాలులో ఆదివారం ఉదయం 10 గంటలకు ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం ఉంటుందని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్వోలు, తహసీల్దార్లు, సెక్టోరల్ అధికారులు పాల్గొనాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, ట్రైనీ కలెక్టర్ హిమవంశి పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు, కలెక్టర్



ఎస్వీసెట్ కౌంటింగ్ కేంద్రం పరిశీలన

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రంగా గుర్తించిన ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఎస్వీసెట్ కౌంటింగ్ కేంద్రంలో స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత, బారికేడింగ్ వ్యవస్థ తదితర అంశాలపై ఎన్నికల పరిశీలకుడు అరవింద్ హెచ్.సాల్వే కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు.

ఆ ఇద్దరు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోండి

● ఎస్బీలో ఉంటూ వైసీపీ కోసం పనిచేస్తున్నారు

● నాతోపాటు మా వాళ్ల ఫోన్లనూ ట్యాప్ చేశారు

● పోస్టల్ బ్యాలెట్ ఓట్లనూ ప్రభావితం చేస్తున్నారు

● రామకృష్ణ, దాముపై ఈసీకి గురజాల ఫిర్యాదు

చిత్తూరు ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'చిత్తూరు స్పెషల్ బ్రాంచిలోని రామకృష్ణ, దాము అనే ఇద్దరు కానిస్టేబుళ్లు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి కోసం పనిచేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి సొంతూరుకు చెందిన వీరిద్దరిపై వెంటనే చర్యలు తీసుకోండి' అని చిత్తూరు టీడీపీ కూటమి అభ్యర్థి గురజాల జగన్మోహన్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘంతో పాటు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్, ఆర్వో (జేసీ) శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. 'రామకృష్ణ, దాము స్పెషల్ బ్రాంచిలో పనిచేస్తున్నారు. వీరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి స్వగ్రామమైన ఎస్ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్టకు చెందినవారు. చిత్తూరులో వైసీపీ గెలుపు కోసం పనిచేస్తున్నారు. గతంలో స్పెషల్ బ్రాంచిలో పనిచేసిన సీఐ గంగిరెడ్డి వీరిని నియమించారు. స్పెషల్ బ్రాంచిలో పనిచేయాలంటే కనీసం హెడ్ కానిస్టేబుల్ స్థాయి ఉండాలి. అర్హత లేని వీరిని విజయానందరెడ్డి తన రాజకీయ పలుకుబడి ఉపయోగించి నియమించుకున్నారు. నాతో పాటు నా అనుచరుల ఫోన్లను.. వాట్సాప్ చాట్‌లను కూడా ట్యాప్ చేయడంలో ఈ ఇద్దరి కుట్ర ఉంది. దీనిపై విచారించి వెంటనే చర్యలు తీసుకోండి. ఈ ఇద్దరు కానిస్టేబుళ్లు నాకు కావాల్సినవారి ఇళ్ల మీద దాడులు చేస్తున్నారు. చిత్తూరులో టీడీపీ రోజువారి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు వైసీపీ అభ్యర్థికి చేరవేస్తున్నారు. వైసీపీ కార్యాలయంలో కూర్చొని ఆ పార్టీకి అనుకూలంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ప్రభావితం చేస్తున్నారు. వీళ్లను స్పెషల్ బ్రాంచిలో కొనసాగిస్తే నిష్పక్షపాత ఎన్నికలు జరిగే అవకాశాలు లేవు. తక్షణమే వీరి మీద చర్యలు తీసుకోండి' అని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రభాకరుడి ప్రతాపం

పులిచెర్లలో అత్యధికంగా 42.7 డిగ్రీల నమోదు



బోసిపోయిన ఎమ్మెస్సార్ సర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26: జిల్లాలో రోజురోజుకూ ఎండలు పెరిగిపోతున్నాయి. ఎండల తీవ్రతకు జనం బయటకు రావడానికి భయపడిపోతున్నారు. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా మధ్యాహ్న సమయంలో వీధులన్నీ బోసిపోతున్నాయి. శుక్రవారం పులిచెర్లలో అత్యధికంగా 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే శ్రీరంగరాజపురంలో 42.3, సోమల 42.2, తవణంపల్లె 42.1, పుంగనూరు 41.8, నింద్ర 41.3, బంగారుపాళ్యం 41.1, గుడిపాల 40.8, సదుం 40.8, కుప్పం 40.7, పాలసముద్రం 40.1, చిత్తూరులో, గంగాధరనెల్లూరు, కార్వేటినగరంలో 40 డిగ్రీలు నమోదైంది.

పంతుళ్లపై పగ

214 మంది హెచ్ఎంలకు, 26 మంది ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు

● ఐదేళ్లుగా ఇదే తరహా వేధింపులు

● నాడునేడు పనుల పర్యవేక్షణ.. మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల శుభ్రతా వారి బాధ్యతే

● కరోనా లాక్‌డౌన్‌లో మద్యం దుకాణాల వద్ద కాపలా



సీపీఎస్ రద్దుకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సభను అడ్డుకుంటున్న పోలీసులు (ఫైల్ ఫోటో)

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 26: టీచర్లకు జగన్ ప్రభుత్వంలో చుక్కలు చూపించారు. ఈ ఐదేళ్లలో ఏ శాఖకూ లేని షరతులు, నిబంధనలు, అదనపు పని భారం పెట్టి నిత్యం వేధించారు. తాజాగా యూడైస్ (విద్యార్థుల నమోదు) ప్రక్రియలో చోటు చేసుకున్న చిన్ని చిన్న తప్పులను కారణాలుగా చూపుతూ 25 మండలాల్లోని 213మంది హెచ్ఎంలకు, 26 మంది ఎంఈవోలకు డీఈవో దేవరాజు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాప్టో, ఎస్టీయూ సంఘాల నాయకులు శుక్రవారం డీఈవోతో చర్చలు జరిపారు. పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడం, ఉన్న వాటిలో సిగ్నల్స్ రాకపోవడం వంటి అనేక కారణాలున్నాయని, వీటికి ఎవరు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. శాఖపరమైన లోపాలు సవరించకుండా సమాచారం రాలేదనే సాకుతో టీచర్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ఉపసంహరించుకోవాలని డీఈవోకు వినతిపత్రం అందించారు.

పెరిగిన పనిభారం

గడిచిన ఐదేళ్లలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఉన్న వారిపై పనిభారం పడింది. జిల్లాలో 1,300 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. ఇందులోని సింగిల్ టీచర్ రోజుకు 20 తరగతులు బోధించాలి. దీంతోపాటు పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, మార్కుల నమోదు, విద్యార్థుల సామర్థ్యం గ్రేడింగ్, సబ్జెక్టుల్లో వెనుకబడిన వారికి ప్రత్యేక శిక్షణ ఇవాల్సి ఉంది. సమావేశాలకు హాజరు కావడం, అడిగిన సమాచారం ఇవ్వడం వంటివి చేయాల్సి ఉంది.

నాడు-నేడు పనుల పర్యవేక్షణ

పాఠశాల రూపురేఖలు మార్చడంలో భాగంగా రెండు విడతలుగా నాడునేడు కింద పనులు చేపట్టారు. వీటిని పర్యవేక్షించడమేగాక సంబంధిత వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే పని టీచర్లకు అప్పగించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పర్యవేక్షణ, వివరాల నమోదు వారికే అప్పగించారు. విద్యార్థుల హాజరు, మరుగుదొడ్ల నిర్వహణ ఇలాంటి అనేక రకాలైన ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. జగనన్న విద్యాకానుక అందజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇవన్నీ జగన్న పాలనలో టీచర్లను వేధింపులకు గురిచేసిన అంశాలే.



షోకాజ్ నోటీసులపై డీఈవోతో చర్చిస్తున్న ఎస్టీయూ నేతలు - డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

కరోనా కాలంలో మద్యం దుకాణాల వద్ద..

కరోనా లాక్‌డౌన్ సమయంలోనూ టీచర్లను వదల్లేదు. మద్యం దుకాణాల వద్ద పీడీ, పీఈటీలకు విధులు అప్పగించారు. విద్యాబుద్ధులు నేర్పించే టీచర్లు మద్యం దుకాణాల వద్ద కాపాలా ఏమిటనే దానిపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమైనా జగన్ సర్కార్ పట్టించుకోలేదు.

న్యాయ పోరాటాలు

జగన్ ప్రభుత్వ నిర్ణయాలపై పోరాడే కొంతమంది టీచర్లు మరింత బానిసలుగా మారిపోతున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఏటా వందలాది మంది టీచర్లు ఉద్యోగ విరమణ పొందుతుండంతో పోస్టులు ఖాళీ అవుతున్నాయి. దీంతో డీఎస్సీ ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వంపై ఐదేళ్లుగా ఒత్తిడి పెంచుతున్నా ఫలితం దక్కలేదు. మరో వైపు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ప్రకటించాలని ఉద్యమాలు చేస్తున్నా చివరి సమయంలో జీపీఎస్ ప్రకటించింది. ఓపీఎస్ ప్రకటించకుండా కాలయాపన చేసింది. 117 జీవో రద్దుపై ధర్నాలు, నిరసనలు చేపట్టారు. అక్రమ బదిలీలు, డెప్యూటేషన్లను నిరసిస్తూ ఉద్యమాలు కొనసాగించినా ఫలితం శూన్యంగా కనిపిస్తోంది. బోధనేతర కార్యక్రమాలు రద్దు, సీనియారిటీ జాబితా ప్రకటన, ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి అనే అనేక అంశాలపై చేసిన యత్నాలు, నిరసనలు, దీక్షలు, ధర్నాలు నిరుపయోగంగా మారాయి.

దాచుకున్న సొమ్ముకోసం..

సొంత అవసరాలకు ప్రభుత్వం కల్పించిన కొన్ని వెసలుబాట్లను ఉపయోగించుకుని ఉపాధ్యాయులు పలు మార్గాల్లో సొమ్ము దాచుకుంటున్నారు. జిల్లా పరిషత్‌లోని పీఎఫ్, ఏపీజీఎల్, ఈఎల్ తదితరాల్లో సొమ్ము దాచుకుంటారు. అవసరానికి దరఖాస్తు చేసుకున్న వెంటనే ఈ మొత్తాలను ఇవ్వాల్సి ఉంది. ఈ విషయంలోనూ టీచర్లకు ప్రభుత్వ నుంచి పరోక్షంగా వేదింపులు తప్పలేదు. ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు చేసిన విజ్ఞప్తులు అడవిరోదనగా మిగిలిపోయాయి.



దాడిలో ధ్వంసమైన వాహనం అద్దాలు

'మా ఊరికొస్తే చంపేస్తాం'

మాగాండ్లపల్లెలో బీసీవైపీ నేతలపై వైసీపీ శ్రేణుల దాడి

రామచంద్రయాదవ్ కాన్వాయ్‌లోని వాహనం అద్దాల ధ్వంసం

ఇరుపార్టీల నేతల వాగ్వాదాలు, తోపులాటలతో ఉద్రిక్తత



సీఐ రాఘవరెడ్డిని అడ్డుకుంటున్న సీఆర్పీఎఫ్ భద్రతా సిబ్బంది - సీఐతో మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

పుంగనూరు, ఏప్రిల్ 26: ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మా ఊరుకొస్తే చంపేస్తాం' అంటూ పుంగనూరు మండలం మాగాండ్లపల్లెలో శుక్రవారం వైసీపీ కార్యకర్తలు బీసీవైపార్టీకి చెందిన నలుగురు నాయకులపై కర్రలతో దాడి చేశారు. బీసీవై పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్ కాన్వాయ్‌లోని వాహనం అద్దాలను ధ్వంసం చేశారు. బాధితుల కథనం మేరకు.. ఎన్నికల ప్రచారంలో భాగంగా రామచంద్రయాదవ్ మాగాండ్లపల్లెలో రోడ్డుషో చేసి, వెళుతుండగా కాన్వాయ్ చివరలో ఉన్న వాహనంలోని ఆ పార్టీ నేతలు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. 'మాకే పాంప్లెట్లు ఇస్తారా' అంటూ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త శశిభూషణ్‌రెడ్డి మరికొందరు బీసీవైపీ నాయకులు నారాయణస్వామి, వేణుగోపాల్‌రెడ్డి, వంశీ, సురేంద్రయాదవ్‌లపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. దుర్భాషలాడి కరపత్రాలు చింపేశారు. వారు వాహనంలో వెళ్లిపోతుండగా వైసీపీ జెండాలతో వెంబడించి రాళ్లతో వెనుక అద్దాలను ధ్వంసం చేశారు. ఆ నలుగురిని పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న రామచంద్రయాదవ్ మాగాండ్లపల్లెకు చేరుకున్నారు. అప్పటికే పుంగనూరు సీఐ రాఘవరెడ్డి అక్కడ బందోబస్తు ఏర్పాటు చేసి ఉన్నారు. రామచంద్రయాదవ్ రాగానే అడ్డుకుని ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని చెప్పారు. తమ పార్టీ నాయకులను గ్రామస్తులు నిర్బంధించారని, వారిని విడిచిపెట్టాలని, అలాగే వారిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో వైసీపీ శ్రేణులు రావడం, బీసీవై పార్టీ నాయకులు, కార్యకర్తలు చేరుకోవడంతో వాగ్వాదాలు, తోపులాటలతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు సర్దిచెప్పి బీసీవై పార్టీ నాయకులను విడిపించడంతో పరిస్థితి సర్దుమణిగింది. ఇదిలావుంటే తన ఇంటిపై బీసీవైపీ నాయకులు దాడిచేశారని వైసీపీ కార్యకర్త శశిభూషణరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే బీసీవై పార్టీ నాయకుడు నారాయణస్వామి తమపై దాడి చేసి గాయపరిచారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గడదేశిలోనూ అడ్డగింత

పుంగనూరు మండలం గడదేశిలోనూ బీసీవై పార్టీ నాయకులను వైసీపీ శ్రేణులు శుక్రవారం రాత్రి అడ్డుకున్నాయి. బీసీవైపీ అభ్యర్థి రామచంద్రయాదవ్ రోడ్డుషోలో భాగంగా గడదేశికి రాగానే కొందరు మద్యం మత్తులో గ్రామంలోకి రాకూడదని గొడవ చేశారు. 'అడ్డుకోవడానికి మీరెవరు' అంటూ వైసీపీ నేతలు ముందుకు దూసుకెళ్లారు. విషయం తెలియగానే పుంగనూరు పోలీసులు అక్కడికి చేరుకుని గొడవలు లేకుండా చూశారు.

ఓటమి భయంతోనే దాడులు : రామచంద్రయాదవ్

ఓటమి భయంతోనే వైసీపీ నేతలు దాడులు, అరాచకాలకు పాల్పడుతున్నారని, గొడవలు చేసిన వారిని వదిలిపెట్టేదిలేదని స్పష్టం చేశారు. వైసీపీ బెదిరింపులకు భయపడేవారు ఎవరూ లేరని, ప్రజల మద్దతు ఉంటే ఎన్నికల్లో చూసుకోవాలి తప్ప అధికారం ఉందని దాడులు చేయడం సిగ్గుచేటని ఖండించారు. ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని, వైసీపీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.

చిత్తూరు జిల్లా కార్వేటినగరానికి చెందిన మునస్వామి రేటు తక్కువని తన సమీపంలో తమిళనాడు పరిధిలోని పల్లెపట్టు బంకుకు వచ్చి ట్రాక్టరులో డీజిల్ వేయించుకుంటారు. ఆయనే కాదు అక్కడి ద్విచక్ర వాహన చోదకులూ ఇక్కడికే వచ్చి పెట్రోలు కొనుక్కుంటారు. తడ మండల గ్రామాలవారు తమకు దగ్గరగా ఉన్న తమిళనాడు పరిధిలోని ఆరంబాకం, ఎళావురు వెళ్లి బంకుల్లో పెట్రోలు,డీజిల్ వేయించుకుంటారు. కర్ణాటక సరిహద్దులోని ఆంధ్రా వాసులు కూడా తమకు దగ్గరలోని పొరుగు రాష్ట్ర బంకులకే క్యూ కడతారు.

- తిరుపతి(నేరవిభాగం)



పెట్రోలు లీటరు ధర రూ.లలో			
సంవత్సరం	తిరుపతి	తమిళనాడు	కర్ణాటక
2018	75.13	74.93	75.13
2024	109.52	103.88	102.95

డీజిల్ లీటరు ధర రూ.లలో			
సంవత్సరం	తిరుపతి	తమిళనాడు	కర్ణాటక
2018	69.10	69.10	68.92
2024	97.35	92.34	93.18

వ్యాట్

ఈజ్ దిస్ బాదుడు జగనా

- వైసీపీ పాలనలో పెట్రోలు,డీజిల్ ధరలపై అమాంతం వ్యాట్ పన్ను పెంపు
- దేశంలోనే లేని రేట్లతో మోయలేని భారం
- గగ్గోలు పెడుతున్న వాహన యజమానులు

జగన్ గత ఎన్నికల ప్రచార సభల్లో బాదుడే బాదుడు అంటూ విమర్శలు గుప్పించారు. తాను అధికారంలోకి రాగానే ధరలన్నీ కిందకు దించేస్తానని జనాన్ని ఆశల పల్లకిలో ఊరేగించారు. తీరా అధికార పగ్గాలు చేపట్టేక అసలైన బాదుడెలా ఉంటుందో చూపించారు. కేంద్రం ధరలు నిర్ణయించే పెట్రోలు,డీజిల్‌పైనా తన ప్రతాపం చూపించారు. పొరుగు రాష్ట్రాలే నయమనిపించేలా పెంచేశారు. 2022 నుంచి దేశంలోనే ఎక్కడా లేనంతగా రాష్ట్ర వాటా కింద వ్యాట్, రోడ్డు అభివృద్ధి సెస్‌ల పేరుతో అదనపు వడ్డనకు దిగారు.

వినియోగదారులకు డీ'జెల్ల'

వ్యాట్ ప్రభావంతో డీజిల్ ధరలూ పెరిగి ఆటో డ్రయివర్లు లాంటి చిన్న బతుకుల నడ్డి విరిచింది. లీటర్ డీజిల్ డీలరుకు రూ.50.47కి విక్రయిస్తుండగా ఎక్సైజ్ డ్యూటీ కింద రూ.17.65, డీలరు కమీషన్‌గా రూ.2.84,వ్యాట్ రూపంలో రూ.26.39 వసూలు చేస్తున్నారు. దీంతో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన బంకుల్లో ధరలు అధికంగా ఉంటున్నాయని వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు. తమపై జగన్‌కు నిజమైన ప్రేమాభిమానముంటే వ్యాట్ తగ్గించి ఇంత భారం మోపేవారుకాదంటున్నారు వాహన చోదకులు. బయటకు దొరక్కుండా ఇంధన ధరలతో బాదేసి పరోక్షంగా అన్ని ధరలూ పెరిగేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బండి తీయాలంటేనే భయం

గతంలో లీటరు పెట్రోలుపై రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ రూ.11.95 వసూలు చేసేది. జగన్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత వ్యాట్ పెంచుకుంటూ పోయారు. దేశంలో ఎక్కడా లేని రోడ్డు అభివృద్ధి పన్ను కూడా ఈ భారానికి జోడించారు. దీంతో 2022లోనే ఇంధనంపై వ్యాట్ రూ.15.44కి చేరుకుంది. ఇప్పుడది ఇంకా పెరిగిపోయింది. తాజాగా పెట్రోలు ధర తీరును పరిశీలిస్తే డీలర్‌కు లీటర్ రూ.60.39కి విక్రయిస్తుండగా ఎక్సైజ్ డ్యూటీ కింద రూ.19.90 వేస్తున్నారు. డీలర్ కమీషన్‌గా రూ.2.84, వ్యాట్ రూపంలో ఏకంగా రూ.26.39 వసూలు చేస్తున్నారు. వ్యాట్ అమాంతం పెంచేయడంతో ఇంధన వినియోగదారులు బండి తీయాలంటేనే భయపడుతున్నారు.

దారుణంగా దోచేస్తున్నారు

జగన్ వచ్చినప్పటి నుంచి పెట్రోలు,డీజిల్ ధరలు పెరిగిపోయాయి. దీనికితోడు .రోజూ ఎక్కడో ఒక చోట పోలీసులు అన్యాయంగా మా ఆటో డ్రయివర్లపై పెనాల్టీలు వేస్తూనే వున్నారు. వారంలో రూ.500 నుంచి రూ. 800 వరకు చలానాలు కడుతున్నాం. మా నుంచి దోచుకుంటున్నారేగాని పైసా ఉపయోగం లేదు.

- శ్రీనివాస్, ఆటో డ్రైవర్, మంగళం

ఏమీ మిగలడం లేదు

లారీలు, వ్యాన్లు బాడుగకు అడిగేవారే లేకుండా పోయారు. లోనులో బండి తీసి ఖాళీగా పెట్టుకుంటున్నాను. అయినా క్వార్టర్ ట్యాక్స్ కట్టాల్సిందే. చంద్రబాబు హయంలో క్వార్టర్ ట్యాక్స్ రూ. 800 కట్టేవాళ్ళం. దాన్ని రద్దు చేసి జగన్ లైఫ్ ట్యాక్స్ పేరుతో రూ.38,000 వసూలు చేస్తున్నారు. ఇది కాకుండా గ్రీన్ ట్యాక్స్ మరో 1200కట్టాలి. ఇవన్నీ భరించలేక బండ్లు అమ్ముకుంటున్నాం.

- గోపి, ఐషర్ వాహనం, తిరుపతి

పరమ చెత్త ప్రభుత్వం

ఇది పరమ చెత్త ప్రభుత్వం. ఏ వర్గాన్ని వదలి పెట్టడంలేదు. పెట్రోలు ధరలు విపరీతంగా పెంచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ లీటరు రూ.109.52 వుంది. గతంలో రూ.700కి స్కూటర్ ట్యాంకు నిండిపోయేది. ఇప్పుడు రూ. 1150కి పట్టుకుంటే ట్యాంకు నిండతా వుంది. జగన్ వ్యాట్‌తో దారుణంగా బాదేస్తున్నారు.

- రామచంద్ర, మధురానగర్



రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెనుమూరు, ఏప్రిల్ 26: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పెనుమూరులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కత్తిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రంగనాథరెడ్డి(43) సొంత పనుల నిమిత్తం బైక్‌లో పెనుమూరుకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో నేంద్రగుంట మార్గంలోని నయారా పెట్రోల్ బంక్ వద్ద వెనుక వస్తున్న క్రేన్ బైక్‌ను ఢీకొంది. 10 మీటర్ల దూరం వరకు లాక్కుంటూ వెళ్లింది. తీవ్ర గాయాలతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


గురునాథం (ఫైల్‌ఫొటో)

పుత్తూరులో యువకుడి మృతి


మోనిష్ (ఫైల్ ఫొటో)

పుత్తూరు అర్బన్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన పుత్తూరులో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలోని దెయ్యాలగుంట వీధికి చెందిన ఎస్.మోనిష్(22) హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసి అవ్వాతాతల వద్ద ఉంటు న్నాడు. తండ్రి వెంకటేశ్వర్లు వృత్తిరీత్యా బెంగళూరులో ఉంటు న్నారు. మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా శివాలయం ఎదురుగా ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి చిత్తూరు వైపు వెళుతున్న లారీ కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చౌడేపల్లెలో మరొకరు

చౌడేపల్లె: బొలెరో వాహనం ఢీకొని ఒకరు మృతిచెందారు. ఈ ఘటన చౌడేపల్లె మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలం లోని తానా కొత్తఇండ్లుకు చెందిన ఆంజప్ప(50) సొంతపనుల నిమిత్తం చౌడేపల్లెకు వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి నడిచి తానా కొత్తఇండ్లకు బయలుదేరాడు. ఈ క్రమంలో ఆయన చిన్నయల్లకుంట్ల సమీపంలో వెళుతుండగా పుంగనూరు నుంచి నంజం పేటకు వెళుతున్న బొలెరో వాహనం ఢీకొంది. గుర్తించిన స్థానికులు 108 వాహనానికి సమా చారం అందించారు. 108 సిబ్బంది గణేష్ ప్రథమ చికిత్స అందించారు. తర్వాత పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు.


ఆంజప్ప

ఈత సరదా ప్రాణం తీసింది

సదుం/సోమల, ఏప్రిల్ 26: ఈత సరదాతో కుంటలో మునిగి బాలుడు మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని 79ఏ చింత మాకులపల్లె పంచాయతీ కారేవాండ్లపల్లెకు చెందిన వెంకటసిద్ధులు, ప్రసన్న దంపతుల చిన్న కుమారుడు భవిత్ కుమార్(15) కలికిరిలో 9వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో శుక్రవారం ఉదయం సోమలలోని అమ్మమ్మ ఇంటికెళ్లాడు. స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు గ్రామ సమీపంలోని కుంట వద్దకు వెళ్లాడు. ఈత రాని కారణంగా కుంటలో దిగిన కాసేపటికి భవిత్ కుమార్ మునిగిపోయాడు. తోటి బాలురు ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశారు. వారు వచ్చి వెలుపలికి తీసేటప్పటికే చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని స్వగ్రామమైన కారేవాండ్లపల్లెకు చేర్చారు. ఉత్సాహంగా అమ్మమ్మ ఊరికి వెళ్లిన బిడ్డ విగత జీవిగా ఇంటికి చేరడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


మృతుడు భవిత్ కుమార్

చిత్తూరు నూతన కోర్టు భవనాల ప్రారంభం నేడు

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 26 : చిత్తూరులోని హైరోడ్డు వద్ద జిల్లా కోర్టు భవనాలను శనివారం ఉదయం 9.30గంటలకు ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా జస్టిస్ ఎస్వీఎన్ భట్టి పాల్గొంటారు.హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్,హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన రావు హాజరు కానున్నారు.వీరంతా శుక్రవారం రాత్రికే చిత్తూరులోని ప్రభా గ్రాండ్ హోటల్‌కు చేరుకోగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.చిత్తూరు నగరంలోని హైరోడ్డు వద్ద గతంలో వుండిన కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరడంతో వాటి స్థానంలో రూ.43కోట్లతో 15 నూతన కోర్టు భవనాల నిర్మాణం 2018లో ప్రారంభమైంది.పనులు పూర్తి కావడంతో శనివారం ప్రారంభించనున్నారు. త్వరలోనే ఇక్కడినుంచే కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.


నూతన కోర్టు భవనం

హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు స్వాగతం

రేణిగుంట, ఏప్రిల్ 26: ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ రఘునందనరావుకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి వచ్చిన వీరికి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జేసీ ధ్యానచంద్ర, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, ఉమ్మడి జిల్లా జడ్జీలు స్వాగతం పలికారు.అనంతరం వారు చిత్తూరు బయల్దేరి వెళ్లారు.



ఎస్వీయూలో నేడు జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 26: ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఛాలెంజెస్ ఇన్ ఫ్లూయిడ్ పవర్ సిస్టం అనే అంశంపై ఈ సదస్సు జరగనుంది. ఇందులో మద్రాసు ఐఐటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ ప్రొఫెసర్ సోమశేఖర్ ఎస్ హిరేమత్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని సదస్సు కో-ఆర్డినేటర్ కె. అరుణ శుక్రవారం తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.72 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.72 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ప్రకటించింది. గురువారం 61,432 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 27,660 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుపతి - శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి (సెంట్రల్), ఏప్రిల్ 26: వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి - శ్రీకాకుళం రోడ్డు మధ్య ప్రత్యేక రైళ్ల (07440-07441)ను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసినట్లు సీపీఆర్వో సీహెచ్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు తిరుపతిలో మే 5 నుంచి 12వ తేదీ వరకు రాకపోకలు సాగుతాయని పేర్కొన్నారు. తిరుపతిలో ప్రత్యేక రైలు మే 5న బయల్దేరి రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా శ్రీకాకుళంరోడ్డు స్టేషన్‌కు చేరుకుంటుందని వివరించారు.

పలు రైళ్లు రద్దు: తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీపీఆర్వో తెలిపారు. తిరుపతి - విల్లుపురం(16870), తిరుపతి - కాట్పాడి మధ్య నడుస్తున్న రైళ్ల (06693)ను ఈనెల 27 నుంచి మే 4వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే పుదుచ్చేరి - తిరుపతి మధ్య నడిచే రైళ్లు(16112-16111) ఈనెల 27 నుంచి మే 4వ తేదీ వరకు తిరుపతి వరకే రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

బంగారు తిరుచ్చిపై పద్మావతిదేవి సాక్షాత్కారం

తిరుచానూరు, ఏప్రిల్ 26: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు శుక్రవారం బంగారు తిరుచ్చిపై భక్తులకు సాక్షాత్కారమిచ్చారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ వేడుకగా జరిగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని ఫ్రైడేగార్డెన్‌కు వేంచేపు చేసి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం అలంకార శోభితురాలైన అమ్మవారు బంగారుతిరుచ్చిపై కొలువుదీరి తిరు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, గణేష్, శేషగిరి, ప్రసాద్, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పిట్టగోడపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

వాకాడు, ఏప్రిల్ 26: పట్టణంలోని వాకాడు అశోక్ పిల్లర్ సెంటర్ సమీపంలోని స్వర్ణముఖి నది తూపిలి సరఫరా కాలువ వంతెన పిట్టగోడపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. శుక్రవారం రాత్రి గూడూరు నుంచి వాకాడు డిపోకు వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి చల్లకాలువ వంతెనపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రయాణికులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. బస్సు ముందు భాగం పాక్షికంగా ధ్వంసమైంది. కాగా అశోక్ పిల్లర్ ప్రాంతంలో విద్యుద్దీపాలు వెలగక పోవడంతో ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు.

మానవత్వం చాటిన ఖాకీలు

అంబులెన్స్‌లో కేరళకు మృతదేహం తరలింపు ● మృతుడి భార్యకు ఆర్థికసాయం

చిత్తూరు, ఏప్రిల్ 26: పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. స్టేషన్‌కు వచ్చే నిందితులతోపాటు బాధితుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తారనే భావన ఉంది. అలాంటి పోలీసుల్లోనూ మానవత్వం ఉందని నిరూపించుకున్నారు చిత్తూరు రెండో పట్టణ పోలీసులు. చిత్తూరులో గురువారం హత్యకు గురైన కేరళకు చెందిన అఫీస్ వివరాలు తెలుసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న బిడ్డలు. కుటుంబ పరిస్థితి అంతంతమాత్రమే. మృతదేహాన్ని కేరళకు తీసుకెళ్లడానికి కూడా ఆర్థికస్థోమత లేదని మృతుడి భార్య నసీమా పోలీసులకు చెప్పారు. దీంతో సీఐ ఉలసయ్య చలించిపోయారు. శుక్రవారం స్టేషన్‌లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. అందరూ చందాలు వేసుకుని మృతదేహాన్ని కేరళకు పంపించే ఏర్పాట్లు చేశారు. అంతేగాక దహన సంస్కారాల కోసం మరో రూ.30వేలను మృతుడి భార్యకు అందించారు. పోలీసులకు కృతజ్ఞతలు చెప్పి ఆమె బంధువులు, బిడ్డలతో కలిసి కేరళకు పయనమయ్యారు.

టీడీపీతోనే మహిళాభివృద్ధి

● డ్వాక్రా సంఘాలు చంద్రబాబుకు మానసపుత్రికలు ● మహిళల స్వయం ఉపాధికి పెద్దపీట వేస్తాం
● దిశ చట్టం కాగితాలకే పరిమితమైంది ● టీడీపీ చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 26: టీడీపీతోనే మహిళాభివృద్ధి సాధ్యమని టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో తెలుగు మహిళ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షురాలు కార్జాల అరుణ అధ్యక్షతన శుక్రవారం మహిళా భేరి సదస్సు నిర్వహించారు. దగ్గుమళ్ల మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళా సాధికారత, సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. మహిళలకు ఆస్తిలో సమానహక్కు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించింది టీడీపీనేనని పేర్కొన్నారు. సమాజంలో స్త్రీలకు గౌరవం, ధైర్యం, హక్కులు కల్పించింది దివంగత ఎన్టీయార్ అని తెలిపారు. మహిళల కోసం తిరుపతిలో పద్మావతి యూనివర్సిటీని ఏర్పాటు చేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు హయాంలో ప్రతి కిలోమీటరకూ ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్లకు అప్పర్ ప్రైమరీ స్కూల్, ఐదు కిలోమీటర్లకు హైస్కూల్, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు తీసుకువచ్చారని తెలిపారు. డ్వాక్రా సంఘాలు చంద్రబాబు మానసపుత్రికలని తెలిపారు. 8 నుంచి 10వ తరగతి విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు ఇచ్చారని గుర్తు చేశారు. దళిత మహిళ ప్రతిభా భారతికి ఏపీ చరిత్రలో మొదటిసారిగా శాసనసభ స్పీకర్ పదవి ఇచ్చారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. గురజాల మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళా శక్తి ద్వారా 18 నుంచి 59 సంవత్సరాల మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా చదువుకునే పిల్లలు ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ ఏడాదికి రూ.15వేలు, దీపం పథకం కింద సంవత్సరానికి మూడు సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం జగన్ దిశ చట్టంపై గొప్పలు చెప్పుకుంటున్నారని, కాని ఆ యాప్ ద్వారా మహిళలకు రక్షణ దొరకడంలేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండ యదవ్, తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం విజయ, మాజీ మేయర్ కఠారి హేమలత, నేతలు రాధేయ్, సీకే లావణ్య, రాణి, వరలక్ష్మి, శ్రీదుర్గ, దీపశ్రీ, సుమతి, జయలక్ష్మి, విక్టోరియపాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు


హాజరైన తెలుగు మహిళలు

పోలింగ్ తేదీ మే 13

గుర్తుంచుకోండి

అధికారం మీ చేతుల్లో, ఈవీఎంల వద్ద ఉంది. గుర్తుంచుకోండి.. మే 13 పోలింగ్ తేదీ.. అంటూ ఓటు విలువను గుర్తు చేస్తూ చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్టిక్కర్ల ద్వారా ప్రచారం కల్పిస్తున్నారు. ఓటు హక్కు ప్రాధాన్యత, పోలింగ్ తేదీపై అవగాహన కోసం ప్రత్యేకంగా స్టిక్కర్లను రూపొందించారు. వీటిని గ్యాస్ సిలిండర్లపై అతికించి సరఫరా చేస్తున్నారు. ఆటోలు, జనం ఎక్కువగా గుమికూడే దుకాణాలు, రద్దీ ప్రాంతాల్లోనూ వీటిని అతికిస్తున్నారు.



- చిత్తూరు

ఒకప్పట్లో 21 ఏళ్లకు ఓటు

ఎట్లెట్లా..

దేశంలో మొదటి సాధారణ ఎన్నికలు 1952లో ఎన్నికల కమిషనర్ సుకుమార్ సైన్ ఆధ్వర్యంలో జరిగాయి. అప్పట్లో 17.90 కోట్ల మంది ఓటర్లు. అప్పటి నుంచి 1985 వరకు జరగిన ఎన్నికల్లో 21 ఏళ్ల నిండిన వారికే ఓటు హక్కు కల్పించారు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక 1988లో 61వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఓటు హక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించారు.



- చిత్తూరు

పోస్టల్ బ్యాలెట్‌లో గుర్తులుండవు

మీకు తెలుసా?

గుర్తులు లేకుండా ఎన్నికలు ఏమిటా అని సందేహం రావచ్చు. ఇది నిజమే! పోస్టల్ బ్యాలెట్‌లో పార్టీ గుర్తులుండవు. అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. సార్వత్రిక ఎన్నికల రోజు విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిన వ్యక్తులు పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగిస్తారు. అంతకుముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగే సమయంలో సాధారణ ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పత్రాన్ని ఉద్యోగులకు ఇచ్చేవారు. వచ్చినవాటిలో చివరివాటిని తీసి పోస్టల్ ఓటు వేసే ఉద్యోగులకు అందించేవారు. ఈవీఎంలు వచ్చాక వీరికి పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. దీన్నిబట్టి వారి నియోజకవర్గం ప్రాంతంలో పోటీచేసే అభ్యర్థి పేరు, పార్టీ పేరు ముద్రిస్తారు. గుర్తు ఉండకపోవడంతో అభ్యర్థి పేరు పక్కన టిక్ చేయాల్సి ఉంటుంది.



- చిత్తూరు కలెక్టరేట్

జన కేతనం



రైతు భరోసా అంటే.. ఊరూరా కేంద్రాలు నిర్మించడం. వాటికి అధికారపార్టీ జెండా రంగులు వేయడం. సీఎం జగన్ బొమ్మను చిత్రించడం. కరెంటు కోతలు.. ఆగిన రాయితీలు.. అందని ప్రభుత్వ సాయాలు. ఇంతేనా..?

కానే కాదు.. నిరంతర విద్యుత్తు సరఫరా, రాయితీలతో రైతులను ఆదుకోవడమే నిజమైన భరోసా. ఈ దిశగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు రైతులకు అండగా నిలుస్తున్నాయి.

అందుకే.. ప్రస్తుతం కుప్పం నియోజకవర్గంలోని కొందరు రైతులు ఎండిపోయిన పంటల దగ్గర గుండెనిండా దుఃఖంతో కుములుతుంటే, పొలాలను బీళ్లు పెట్టుకుని మరికొంతమంది పశువుల కాపరులుగా మారుతున్నారు. ఆ పశువుల మేతకు వేసిన గడ్డిమళ్లూ నీరందక మలమలమాడుతుంటే అచేతనంగా చూస్తున్నారు. కాస్త సరిహద్దులు దాటి చూస్తే.. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని రైతులేమో పంటల సాగుతో సంతృప్త జీవనం సాగిస్తున్నారు.

జిల్లా సరిహద్దుల్లోని మూడు రాష్ట్రాల పరిధిలో వ్యవసాయం, ప్రభుత్వ ప్రోత్సాహాలను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది. దీనిపై ప్రత్యేక కథనం అందిస్తోంది.

- కుప్పం



● 'కోతల' జగన్

కుప్పం మండలం చందం వద్ద కరెంటు కోతలతో ఎండిన టమోటా తోట

కలికానికీ కనిపించని రైతు 'భరోసా'

● ఆగిన సబ్సిడీలు, విద్యుత్తు కోతలతో అన్నదాత సతమతం

● తమిళనాడు, కర్ణాటకల్లో ప్రభుత్వ ప్రోత్సాహంతో పండగలా మారిన వ్యవసాయం

ఏపీ: ఎండుతున్న పంటలు

కుప్పం నియోజవర్గంలో ఉద్యాన పంటలు అధికం. రాగి, వరి వంటి సంప్రదాయ పంటలూ సాగు చేస్తున్నారు. బోర్లలో అరకొరగా నీళ్లున్నా.. పంటలకు అందించేందుకు విద్యుత్తే ఉండడం లేదు. వ్యవసాయానికి 9 గంటల కరెంటు ఇస్తున్నామని అధికార పార్టీ ఊదరగొడుతోంది. పేరుకు ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు రెండు షిఫ్టుల్లో ఇస్తున్నామంటున్నారు. కానీ, ఈ కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. ఒకసారి నీళ్ల పైకెత్తి కొద్దిదూరం పారేసరికి కరెంటు పోతుంది. మళ్లీ కరెంటు వచ్చేలోపల ఈ పారిన నీరు పూర్తిగా ఎండిపోవడంతో తిరిగి మొదటినుంచీ పారగట్టాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. ఇలా కోతలుపోను, కేవలం 4 గంటలపాటే కరెంటు ఉంటోందని చెబుతున్నారు. కోతలవల్ల కొరత పడిన కరెంటును అర్ధరాత్రి ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. అప్పుడూ కరెంటు దైవాధీనమేనట. ఇక, ఏనుగుల భయంతో రైతులు రాత్రిళ్లు చేలల్లోకి వెళ్లడంలేదు. చాలామంది రైతులు పొలాలను బీళ్లు పెట్టుకుంటుంటే, ఇంకొందరు సేద్యం మానేసి కూలీలుగా, పశువుల కాపరులుగా మారిపోతున్నారు.

'భరోసా' ఉత్తిదే

● **తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో..** కుప్పంలోని హార్టికల్చర్ హబ్‌లో రైతులకు టమోటా, మిర్చి నార్లు ఉచితంగా పంపిణీ చేసేవారు. అరటితో పాటు బీన్స్, చిక్కుడు వంటి పందిరి తోటలకు ఎకరాకు 30 శాతం రాయితీ అందించేవారు. రోటవేటర్లు, ట్రాక్టర్లు క్రాప్ కట్టర్స్, టార్పాలిన్లు వంటి వాటికి గరిష్ఠంగా 60 శాతం సబ్సిడీ అందేది. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులనూ సబ్సిడీపై ఇచ్చేవారు. పట్టుపురుగుల షెడ్లకు, పెంపకానికి తగిన ప్రోత్సాహకాలు ఉండేవి. డ్రిప్‌లకు 90 శాతం సబ్సిడీ ఉండేది.

● **వైసీపీ హయాంలో..** ఊరూరా రైతు భరోసా కేంద్రాలు పెట్టడం తప్ప జగన్ పాలనలో సబ్సిడీలు అందలేదు. సుమారు రెండున్నరేళ్ల క్రితం డ్రిప్‌లకు సబ్సిడీ ఇచ్చారు కానీ, తర్వాత అది కూడా ఆగిపోయింది. తప్పదారి ఎప్పుడైనా ఎరువుల పంపిణీ జరిగినా, అవి అధికార పార్టీ నాయకులకు తప్ప సామాన్య రైతులకు అందడంలేదు. బైవోల్టిన్ పట్టుగూళ్లకు పట్టు పరిశ్రమ శాఖ ద్వారా కిలోకు రూ.50 వంతున టీడీపీ హయాంలో ఇచ్చిన ప్రోత్సాహం ఇప్పుడు లేదు. అంటే రైతును జగన్ ప్రభుత్వం అనాథగా వదిలేసింది.



కరెంటుతో ఏగలేకే బీడు పెట్టేసినా

ఇదిగో చూస్తావుండారు గదా. ఇదంతా నా పొలమే. మొత్తం రెండెకరాలు. ఏసిన డ్రిప్ పైపులు పీకేసి బీడు పెట్టేసినా. ల్యాకపోతే ఏంది? కరంటు ఎప్పుడు వొస్తాదో, ఎప్పుడు పోతాదో తెలీదు. వొచ్చినా సుద్దంగా ఒక కాలుగంట నిలవదు. ఇంగ ఎక్కడ పంటకు నీల్లు పారతాయి. అప్పులు పెరిగిపొయ్యినాయా సామీ. అందుకే బీడు పెట్టేసి, రొండుమూడు ఆవులు పట్టుకోని సాకతా ఉండా. ఓటికి గెడ్డి దొరకడం గూడా కష్టమైపోతా వుండాది.

- గురుమూర్తి, చందం, కుప్పం మండలం



కళ్లల్లో నీళ్లు తిరగతావుండాయి

నాకు రెండున్నరెకరాల పొలం. అందులోనే మల్బరీ, రాగులు, పశువుల గడ్డి ఏసుకున్నా. బోర్లో నీల్లుండాది. కానీ పారగట్టేకి కరంటుడల్ల గదా. ఇదిగో.. ఈ గెడ్డి మొక్కలు నిలవనా ఎండిపోతా వుండాయి. నేను ఆరేడు పశువులు పెంచుకుంటా వుండా. ఓటికి మేత దక్కడంలేదు. ఏరేవోళ్ల దగ్గర గెడ్డి కొనుక్కోనొచ్చి ఏస్తావుండా. మల్బరీ, రాగి వంటి పంటలకు అప్పట్లో సబ్సిడీలు ఇచ్చేవోళ్లు, పంట నష్టపోతే నష్టపరిహారమూ అందేది. ఇప్పుడటువంటివేమీ లేదు. కనీసం ఎరువులు, పురుగుమందులు కూడా ఇయ్యడంలేదు.

- ఎం.కృష్ణప్ప, అగరం, గుడుపల్లె మండలం

తమిళనాడు: చేలు పచ్చగా..



తమిళనాడు రాష్ట్రం చిగురుమాకులపల్లెలో కళకళలాడుతున్న రైతు స్వీట్‌కార్న్ తోట

గుడుపల్లె మండలం ఓఎన్ కొత్తూరుకు సుమారు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమిళనాడు రాష్ట్రం వేపనపల్లె పంచాయతీలోని చిగురుమాకులపల్లెను పరిశీలిద్దాం. ఇక్కడ వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరా అవుతోంది. బోర్ల నుంచి నీటిని పారిస్తున్నారు. దీంతో ఎటు చూసినా చేలు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. ఈ ఒక్క గ్రామమే కాదు.. తమిళనాడు రాష్ట్రంలో ఏ పల్లెలోనైనా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తును అక్కడి ప్రభుత్వం సరఫరా చేస్తున్నట్లు అక్కడి రైతులు ఆనందంగా చెప్పారు. పంట సబ్సిడీలు, నష్టపరిహారాలు, ప్రోత్సాహకాలు, సబ్సిడీమీద వ్యవసాయ పరికరాలు తమకు పుష్కలంగా అందుతున్నాయని తెలిపారు.



కరెంటుకు కోతలంటే మాకు తెలీదు

మాకు కరెంటు కోతలంటే ఏందో తెలియదు. రోజులో ఎప్పుడు మోటారు వేసినా రన్ అవుతుంది. అందుకే నాకున్న ఆరెకరాల్లో అరటి, టమోటో, స్వీట్ కార్న్ పండిస్తున్నా. కరెంటు లేకుండా పంటలు ఎండిపోవడమన్నది మేము ఇంతదాకా చూడలేదు. పంటలకు సబ్సిడీలు కూడా మా ప్రభుత్వం బాగానే ఇస్తోంది.

- పెద్దన్న, చిగురుమాకులపల్లె గ్రామం, తమిళనాడు రాష్ట్రం

కర్ణాటక: రైతు మోములో నవ్వులు



బెండవారంలో కళకళలాడుతున్న బీన్స్ తోట

ఇక, కుప్పం నియోజకవర్గానికి పొరుగున ఉన్న ఇంకో రాష్ట్రం కర్ణాటక విషయానికి వస్తే.. అక్కడా ప్రభుత్వంఅనేక రకాలుగా రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. రాగి, టమోటా, మామిడి, వేరుశనగ, అరటి పంటలకు ఎకరాకు రూ.40 వేల దాకా సబ్సిడీ ఇస్తున్నారు. ఏడాదికి రూ.1250 బీమా ప్రీమియం కడితే, ఆయా పంటలకు ప్రకృతి విపత్తులతో జరిగిన నష్టాన్ని బట్టి రూ.30 వేలనుంచి రూ.60 వేలదాకా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తోంది. వ్యవసాయ పరికరాల కొనుగోళ్లకు ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, బీసీ, ఓసీలైతే 75 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. పురుగు మందుల మీద ఏకంగా 80 శాతం సబ్సిడీ లభిస్తోంది. బస్తా యూరియా మీద 10 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. కందులు, రాగులు వంటి చిరుధాన్యాలకూ సబ్సిడీ లభిస్తోంది. ఇక వ్యవసాయానికి కరెంటు సరఫరా కూడా సంతృప్తికరంగానే ఉంది. ఇక్కడ వ్యవసాయానికి రెండు షిఫ్టుల్లో 7 గంటల కరెంటు ఇస్తున్నారు. కాకుంటే, కోతల్లేకుండా పగలు 3 గంటలు, రాత్రి 4 గంటలపాటు సరఫరా అవుతున్నట్లు రైతులు తెలిపారు.

మాకు సబ్సిడీలు బాగా ఇస్తారు

నేను రెండెకరాల అరటి తోట పెట్టాను. ప్రభుత్వంనుంచి ఎకరాకు రూ.30 వేలు సబ్సిడీ లభించింది. ఇంతేకాదు.. పురుగు మందులు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు కూడా సబ్సిడీమీద గవర్నమెంట్ ఇస్తోంది. ఇప్పుడు ఎండలు ఎక్కువగా ఉన్నాయి. కరెంటు బాగానే ఉండడంవల్ల నీటి సమస్య అంతగా లేదు. ఒకవేళ బోర్లో నీళ్ల ఎండిపోయి, పంట ఎండిపోతే.. ఇన్సూరెన్స్ కట్టాను కాబట్టి ఎకరాకు కనీసం రూ.30 వేల నష్టపరిహారం అందుతుంది.



- రమేశ్, రైతు, బెండవారం, కర్ణాటక రాష్ట్రం

టీడీపీ ప్రచారంలో ఎన్‌ఆర్ఐ

● నేను సైతం

రాష్ట్రాభివృద్ధి కోసం ఆలోచించే చంద్రబాబును ఆదర్శంగా తీసుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు యువ ఎన్‌ఆర్ఐ గుడివాడ చరణ్. బంగారుపాళ్యం మండలం శేషాపురానికి చెందిన ఈయన 2017లో అమెరికా వెళ్లారు. వాషింగ్టన్‌లో కన్సల్టెన్సీని నెలకొల్పి వంద మందికిపైగా ఉపాధి కల్పిస్తున్నారు. వందల కోట్ల టర్నోవర్ ఉంది. మరోవైపు సొంత మండలంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. పేద కుటుంబాల్లో పెళ్లిళ్ల జరిగినప్పుడు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల చదువులకు ఆర్థికసాయం చేస్తున్నారు. పేదలు చనిపోతే దహన సంస్కారాలకు ఆర్థికంగా తోడ్పాటునిస్తున్నారు. చంద్రబాబు స్ఫూర్తితో టీడీపీలోకి వచ్చిన ఆయన పూతలపట్టు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రస్తుతం పూతలపట్టు నియోజకవర్గ ఎన్‌ఆర్ఐ కో- ఆర్డినేటర్‌గా ఉన్నారు. విదేశాల్లో నెల రోజులుంటే నియోజకవర్గంలో నెల ఉండి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మురళీమోహన్, దగ్గుమళ్ల ప్రసాదరావు విజయానికి ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు సీఎం అయితే ఇక్కడే సాఫ్ట్‌వేర్ కంపెనీని నిర్మించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని చరణ్ తెలిపారు.



పాలేరులో ప్రచారం చేస్తున్న ఎన్‌ఆర్ఐ గుడివాడ చరణ్

- బంగారుపాళ్యం

డిగ్రీ కాలేజీకి భవనాలేవీ?

● ఉదయం ఇంటర్.. మధ్యాహ్నం డిగ్రీ తరగతులు

జీడీనెల్లూరు నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తా.

- ప్రజాసంకల్ప యాత్ర సందర్భంగా వెదురుకుప్పం మండలంలో జరిగిన రోడ్‌షోలో జగన్ ఇచ్చిన హామీ.

చెవిలో పువ్వు

ఆ మేరకు నాలుగేళ్ల కిందట వెదురుకుప్పం మండలం చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలికం పేరుతో డిగ్రీ తరగతులు ప్రారంభించారు. ఉదయం జూనియర్ కళాశాల, మధ్యాహ్నం డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ల కిందటే డిగ్రీ కాలేజీ నిర్మాణానికి కొమ్మరగుంట రెవెన్యూ పరిధిలో స్థలాన్ని కేటాయించి శిలాఫలకం కూడా వేశారు. నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మరింత ఉత్సాహంతో ఇక్కడ వైఎస్సార్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరించారు. కానీ.. నాలుగేళ్లయినా పునాది రాయి పడలేదు. ఒంటి పూట నిర్వహణతో ఇక్కడ జూనియర్ కాలేజీ బలహీనపడింది. విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోయింది. డిగ్రీ కాలేజీని మా ప్రాంగణం నుంచి ఎత్తేయాలని జూనియర్ కాలేజీ వాళ్ల ఫిర్యాదు కూడా చేశారు.

- వెదురుకుప్పం



వెదురుకుప్పం డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో వైఎస్ విగ్రహం

కుప్పంలో 3 నామినేషన్ల తిరస్కరణ

కుప్పం, ఏప్రిల్ 26: కుప్పంలో శుక్రవారం నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నామినేషన్ల పరిశీలన జరిగింది. ఈ పరిశీలనలో నిబంధనలు పాటించని ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. స్వతంత్ర అభ్యర్థిగా వెంకటరామిరెడ్డి పార్థసారథిరెడ్డి వేసిన నామినేషన్‌లో ప్రతిపాదించాల్సి 10 మంది వ్యక్తుల సంతకాలు ఒకరే పెట్టినట్లుగా తేల్చి ఆయన నామినేషన్ తిరస్కరించారు. అలాగే జై భారత్ పార్టీ తరపున నామినేషన్ వేసిన రూప నామినేషన్‌లో ప్రతిపాదించాల్సిన వ్యక్తుల సంతకాలు 10కి బదులుగా 9 మాత్రమే ఉండడంతో తిరస్కరణకు గురైంది. నవరంగ్ పార్టీ అభ్యర్థి జగదీశ్ వేసిన నామినేషన్‌లో ప్రపాదించాల్సిన వ్యక్తుల సంతకాలే లేకపోవడంతో తిరస్కరించారు. ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించడంతో ప్రస్తుతం బరిలో 15 మంది మిగిలారు. ఈనెల 29వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు ఉండడంతో చివరకు ఎంతమంది బరిలో తేలుతారో వేచి చూడాల్సి వుంది.

పలమనేరులో ఐదు నామినేషన్లు..

పలమనేరు, ఏప్రిల్26 : పలమనేరు నియోజకవర్గంలో ఐదుగురి నామినేషన్లు తిరస్కరించినట్లు ఆర్‌ఓ మనోజ్‌రెడ్డి తెలిపారు. వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే వెంకటేగౌడ సతీమణి పావని దాఖలు చేసిన నామినేషన్, మాజీ మంత్రి అమరనాథరెడ్డి సతీమణి రేణుకారెడ్డి నామినేషన్, కాంగ్రెస్ అభ్యర్థి శివకుమార్ సతీమణి ఉష నామినేషన్లతో పాటు పిరమిడ్ పార్టీ అభ్యర్థి ఎస్. బాబు బాలక్రిష్ణ, ఆల్‌ఇండియా ఉమెన్ ఎంపవర్‌మెంట్ పార్టీ అభ్యర్థి కొత్తపల్లి ధనరాజ్‌ల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఈ నెల 29న బరిలో మిగిలిన వారి జాబితా ప్రకటిస్తామని ఆర్‌ఓ తెలిపారు.

పుంగనూరులో ఐదు నామినేషన్లు..

పుంగనూరు, ఏప్రిల్ 26: పుంగనూరులో ఐదు మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని ఆర్వో వై.మధుసూదన్‌రెడ్డి వెల్లడించారు. టీడీపీ డమ్మీ అభ్యర్థులు చల్లా సుప్రియ, చల్లా పూజారెడ్డి, వైసీపీ డమ్మీ అభ్యర్థులుగా పి.స్వర్ణలత, కాంగ్రెస్ అభ్యర్థికి డమ్మీగా జి.నందకుమార్‌లు వేసిన నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అలాగే బి.గోపాల్ నామినేషన్ పత్రంలో ప్రతిపాదకులు లేకపోవడంతో నామినేషన్‌ను తిరస్కరించారు. ఇదిలా ఉండగా టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్, బీఎస్పీ అభ్యర్థి సురేశ్, కాంగ్రెస్ అభ్యర్థి జి.మురళీమోహన్ యాదవ్, ఎస్డీపీఐ అభ్యర్థి కేఎస్.అన్వర్‌బాషా, స్వతంత్ర అభ్యర్థులు ఎస్.జమీర్, నాగేశ్వరరావు, పి.ఫయాజ్, జీ.రామయ్యల నామినేషన్లు ఆమోదించారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరుడి శయనోత్సవం

రామకుప్పం, ఏప్రిల్ 26: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం ద్వాదశహారతులు, శయనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. రాజుపేట సోమప్ప, పేపర్ నాగరాజు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను ద్వాదశ ప్రాకారోత్సవాల్లో ఊరేగించారు. అనంతరం ఆదిదంపతులకు శయనోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించు కున్నారు.

అట్టడుగు వర్గాలకు అండగా నిలిచేది టీడీపీనే


పల్లికుప్పంలో టీడీపీ నాయకుల ప్రచారం

రామకుప్పం, ఏప్రిల్ 26: అట్టడుగువర్గాలకు, ముస్లిం మైనారిటీలకు అండగా నిలిచేది టీడీపీ మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేశ్‌బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ తెలిపారు. శుక్రవారం మండల పరిధి పల్లికుప్పం, ముద్దనపల్లె, ఆవులకుప్ప, నారాయణపురం తాండాలలో వారు ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ విస్తరణ విభాగం నియోజకవర్గ సభ్యుడు కన్నన్, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు హరీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం ప్రభుత్వంలోనే ముస్లింలకు న్యాయం


చంద్రబాబు సీఎం కావాలని ముస్లింల ప్రార్థనలు

శాంతిపురం, ఏప్రిల్ 26: తెలుగుదేశం ప్రభుత్వంలోనే ముస్లింలకు న్యాయం జరిగిందని భవిష్యత్తులోనూ జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, నియోజక వర్గ మైనార్టీ అధ్యక్షులు జాకీర్, మైనార్టీ సెల్ నాయకులు సర్దార్ అన్సర్ మునాఫ్, మైనార్టీ నాయకులు నిసార్ బనాలతో కలిసి సోగడబల్ల మసీదులో చంద్రబాబు సీఎం కావాలని ప్రత్యేక పార్థనలు చేశారు. వచ్చే ఎన్నికల్లో ముస్లింలు సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీని గెలపించాలని అభ్యర్థించారు. ఎస్సీ సెల్ నాయకులు కన్నన్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

టీడీపీతోనే పల్లెల ప్రగతి సాధ్యం


క్రిష్ణేపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

శాంతిపురం, ఏప్రిల్ 26: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటేనే పల్లెల ప్రగతి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల అధ్యక్షులు బాష్యం విశ్వనాథ్ నాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయ్ కుమార్, మాజీ మండల టీడీపీ అధ్యక్షులు విజయరామి రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని కడపల్లె పంచాయతీ క్రిష్ణేపల్లె, ఇంద్రానగర్ కాలనీ, చిట్టిపల్లె, గంగతిమ్మనపల్లె గ్రామాల్లో తెలుగుదేశం నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, నారాయణరెడ్డి, ఎంసీ నాగరాజు, పెద్దన్న, ఆర్‌ఎస్ మణి, గోపాల్, శ్యామల, చంద్రకళ పాల్గొన్నారు.

శ్మశాన దారి ఆక్రమణ..అడ్డుకున్న దళితులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్26: దళిత శ్మశాన దారి ఆక్రమణకు గురికాకుండా చూడాలని దళిత సంఘనాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలోని తూర్పుమొగసాల దళితవాడకు చెందిన శ్మశానికి వెళ్లే దారిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎక్స్‌వేటర్‌తో చదును చేస్తున్నట్లు తెలుసుకుని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దళిత సంఘనాయకులు రాజన్న మాట్లాడుతూ ప్రభుత్వాధికారులు స్పందించి దారి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు

చౌడేపల్లె, ఏప్రిల్26: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నవధాన్య అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు రూరల్: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్యఅలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు అమ్మవారికి చీరలు, రవికలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మహిళలకు నెలకు రూ.1500: టీడీపీ


పంజాణి మండలంలో పార్టీలో చేరుతున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పలమనేరులో మాట్లాడుతున్న అమర్

పలమనేరు, ఏప్రిల్26: ఎన్నికల ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి సూచించారు. శుక్రవారం పలమనేరు మండల తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటువేసేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాగరాజరెడ్డి, ప్రధానకార్యదర్శి గణేష్, పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని లక్కనపల్లె, పాతూరు నత్తం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో టీడీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, మాజీ ఎంపీపీ కృష్ణవేణి, మాజీ జడ్పీటీసీ రాధమ్మ పాల్గొన్నారు.

టీడీపీనేత మునస్వామిరెడ్డికి పరామర్శ

మండలంలోని గొల్లచీమనపల్లెకు చెందిన మాజీ ఎంపీటీసీ మునస్వామిరెడ్డి తల్లి మునిలక్ష్మమ్మ మృతి చెందారు. అమరనాథరెడ్డి సతీమణి రేణుకారెడ్డి ఆమెకు నివాళులర్పించారు.

పెద్దపంజాణి: మండలంలోని చిన్నవెళగటూరు, చెన్నారెడ్డిపల్లె గ్రామాలలో మండలంలోని టీడీపీ క్లస్టర్ యూనిట్, సెక్షన్ ఇన్‌చార్జిలు, బూత్‌కమిటీ, గ్రామ కమిటీ సభ్యుల సమావేశాల్లో మాజీ మంత్రి అమరనాథరెడ్డి మాట్లాడారు. అనంతరం ఇంటలిజెన్స్ విశ్రాంత అధికారి సుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో చామనేరు పంచాయతీ నాయకులు, కార్యకర్తలు, కరసనపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. అలాగే చెన్నారెడ్డిపల్లె వద్ద జరిగిన సమావేశం లో మేస్త్రీ రెడ్డెప్ప, శంకర, నాగరాజు తది తరులు పార్టీలో చేరారు. అమరనాథరెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ భాస్కరరెడ్డి, పార్టీ అధ్యక్షులు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చలపతి పాల్గొన్నారు. ● బట్టందొడ్డి పంచాయతీలో మృతిచెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌కు మాజీ మంత్రి అమర్‌నాథరెడ్డి నివాళులర్పించారు.

పాలిసెట్ నిర్వహణకు సర్వంసిద్ధం

పలమనేరు, ఏప్రిల్26 : పలమనేరులో ఈ నెల 27వ తేదీ శనివారం జరిగే పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు పరీక్షల కో- ఆర్డినేటర్ మొహమ్మద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ పరీక్షలకు 1463 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షకు గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలికోన్నత పాఠశాల, శ్రీసాయి చైతన్యజూనియర్ కళాశాలలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదని స్పష్టంచేశారు. ఇప్పటికీ పరీక్షఫీజు చెల్లించని విద్యార్థులు శనివారం పరీక్ష హాల్‌కు వెళ్లేమందే ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. ఇటువంటి విద్యార్థులు తమ 10 వతరగతి హాల్‌టికెట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, అప్లికేషన్ తీసుకొని రావాల న్నారు. ఈ అవకాశం కేవలం ప్రభుత్వ మహిళాపాలిటెక్నిక్ కళాశాల కేంద్రంలో మాత్రమే అని తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 22 కుటుంబాలు


టీడీపీలో చేరిన కుటుంబాలతో ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం రూరల్, ఏప్రిల్ 26: కుప్పం మండలం వానగుట్టపల్లె పంచాయతీ మాళిగప్ప కొట్టాలు గ్రామంలో శుక్రవారం 22 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మాళిగప్ప, బెంగ ఈరప్ప, పూజారి సిద్ధప్ప, వెంకటేశ్, రేవప్ప, రైల్వే సిద్ధప్ప, రాజా, వి.వెంకటేశ్, మణి, కాళి యప్ప, సిద్దేశ్వర, సిద్ధమ్మ, శంకరప్ప, కనకప్ప, అప్పులు, సోము, కృష్ణకుమార్, ఎస్.సిద్ధప్ప, రవి, శ్రీనివాసులు, షణ్ము గం తదితర కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు మల్లా నూరు ప్రేమ్ కుమార్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే మైనారిటీలకు పెద్దపీట

సోమల, ఏప్రిల్ 26: టీడీపీ పాలనలో ముస్లిం మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించారని ఆ పార్టీ జిల్లా మైనార్టీ నేత అష్రఫ్ అలీ పేర్కొన్నారు. శుక్రవారం నంజంపేట, గొల్లపల్లెల్లో జనసేన, టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డిని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: టీడీపీ హయాంలోనే మైనారిటీలకు పెద్దపీట వేశారని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి తెలియజేశారు. పులిచెర్ల మండలం కల్లూరులో శుక్రవారం టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను జనంలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యకమంలో టీడీపీ, బీజేపీ నాయకులు నూర్‌బాషా, ఖాదర్‌వల్లి, అష్రఫ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చల్లా పరామర్శ

పది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చనిపోయిన కల్లూరుకి చెందిన కస్మూర్ అలీ (27)కి చల్లాబాబు నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయం అందజేశారు.

● రెడ్డివారిపల్లి పంచాయతీలోని నవాబుపేట, ముప్పిరెడ్డిగారిపల్లి, చిచ్చిలివారిపల్లి, పార్వతీపురం, వంకమద్దివారిపల్లిలో చల్లా రామచంద్రారెడ్డి కుమార్తె చల్లా పూజారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రొంపిచెర్ల: టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులు గెలిపిస్తే గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతాయని చల్లా రామచంద్రారెడ్డి సతీమణి సుప్రియారెడ్డి పేర్కొన్నారు. ఆమె తన భర్త చల్లాబాబును గెలిపించాలని మండలంలోని బండకిందపల్లె పంచాయతీలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదనమోహన్‌రెడ్డి, నదుం చంద్రారెడ్డి, భాస్కరయ్య, వెంకట్రమణారెడ్డి, బారేషా, రవీంద్రారెడ్డి, స్వామిరెడ్డి, ఆషీఫ్, జాఫర్‌షా, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి మండలంలోని దాదేపల్లె, బుటకపల్లె, రాజులూరు, దుర్గసముద్రం, బండ మీదపల్లె, కేతనపల్లె, చిన్నగానిపల్లె, గాండ్లపల్లె గ్రామాలలో ఇంటింటా ప్రచారం చేశారు. టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి. లక్ష్మీపతిరాజు, మాజీ ఎంపీపీ చంద్రవదనమ్మ, బోయకొండ సుబ్బు, హరిప్రసాద్, భోజనాలరెడ్డి, గిరిరాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: తాటిమాకులపాళ్యం, ఎంఎస్ థియేటర్, మినీ బైపాస్‌రోడ్డు, దోబీకాలనీ తదితర ప్రాంతాలల్లో టీడీపీ శ్రేణులు, నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో దౌర్జన్యాలు, దోపిడీలు ఆగాలంటే ఉమ్మడి ప్రభుత్వం రావాలని తెలియజేశారు. టీడీపీ నాయకులు మాధవరెడ్డి, దేశాదిప్రకాశ్, నాగరాజ, చక్రి, గంగాధర్, బీజేపీ నాయకులు నానబాలకుమార్, మఠంబాబు, జనసేన నాయకులు నరేశ్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.


బండకిందపల్లె పంచాయతీలో చల్లా సుప్రియారెడ్డి ప్రచారం


చౌడేపల్లె మండలం బుటకపల్లెలో వీణారెడ్డి ప్రచారం


కస్మూర్ అలీకి నివాళులర్పిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

పుంగనూరు రూరల్, ఏప్రిల్26: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్‌బాషా ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రహదారి చూస్తేనే అభివృద్ధి ఏమిటో తెలుస్తుందన్నారు. పట్టణంలో వేసిన సీసీ రోడ్లు గుంతలమయంగా మారాయన్నారు. ఎక్కడ చూసినా కంకర తేలిపోయాయని పేర్కొన్నారు. ఇలాంటి పార్టీని మళ్లీ గెలిపిస్తే పనులు చేయకనే బిల్లులు చేసుకుంటారన్నారు. టీడీపీ మాజీ కౌన్సిలర్ అబ్బాస్, నరేష్‌రాయల్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


ఆర్సీసుబ్బారెడ్డి కుటుంబసభ్యులతో సురేష్‌బాబు

రామకుప్పం, ఏప్రిల్ 26: రామకుప్పానికి చెందిన వైసీపీ సీనియర్ నేత ఆర్సీసుబ్బారెడ్డి, ఆయన కుమారులు ప్రతాపరెడ్డి, సురేష్‌రెడ్డితో బాటు వారి కుటుంబసభ్యులు, రామనగర్ కాలనీకి చెందిన పీవీనాగరాజు, బీఎన్‌నాగరాజులు, పల్లెకుప్పానికి చెందిన వైసీపీ కార్యకర్తలు రామ్‌బాబు, లక్ష్మణ్‌బాబు, రాజేంద్ర, మణి, శ్రీనివాసులు, అరుణ, మణికంఠ, బాలాజీ, చంద్రమోహన్, రాజప్ప, వీర్నమల పంచాయతీకి చెందిన వైసీపీ మాజీ ఎంపీటీసీ కనకరాజు, నేతలు జైకుమార్, పన్నీర్‌లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి టీడీపీ విస్తరణ విభాగం కుప్పం నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ సురేష్‌బాబు, సభ్యుడు కన్నన్, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా పంచాయతీల నేతలు రామకృష్ణప్ప, నందారెడ్డి, సలాంసాబ్, అక్బర్‌సాబ్, వెంకటరమణ, శ్రీనాథరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంత పుంగనూరే బీసీవై లక్ష్యం


మిట్టచింతలపల్లెలో రామచంద్రయాదవ్‌కు హారతి ఇస్తున్న మహిళ, మంగళంలో రామచంద్రయాదవ్ రోడ్‌షో

- అరాచకాల నెలవుగా పుంగనూరు
- దౌర్జాన్యాలు లేని పాలన అందిస్తాం
- చెడ్డపేరు తొలగిద్దాం
- యువతకు ఉపాధి కల్పిస్తాం
- రోడ్‌షోలో రామచంద్రయాదవ్

పుంగనూరు, ఏప్రిల్ 26: ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాకతో అరాచకాలు పెరిగిపోయాయని బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్ విమర్శించారు. శుక్రవారం పుంగనూరు మండలం జో కొత్తూరు నుంచి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్ని గ్రామాల్లో రోడ్డుషో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆయన ప్రజలతో మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి అవినీతి, దోపిడీ, అరాచకాలపై పోరాడుతున్నానని తెలిపారు. ప్రశ్నిస్తున్నానని తనపై అనేక తప్పుడు కేసులు పెట్టించి ఇంటిపై దాడి చేయించారని గుర్తుచేశారు. పుంగనూరు నియోజకవర్గంలో అన్ని కాంట్రాక్టు పనులు, రాజకీయ పెత్తనం పెద్దిరెడ్డికే ఉండాలని, ఇతరులు వస్తే వారిని అనేక ఇబ్బందులు పెట్టి పోలీసులు ద్వారా హింసిస్తున్నారని ఆరోపించారు. మూడు పర్యాయాలు ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదని, కేవలం వారి సంపాదన కోసం కాంట్రాక్టులు పొంది జేబులు నింపుకుంటున్నారని దుయ్యబట్టారు. అధికారం ఉందని పోలీసు, రెవెన్యూ అధికారుల ద్వారా అక్రమంగా కేసులు పెట్టారని తెలిఆపు. అయితే ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసీపీని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే పుంగనూరు నియోజకవర్గంలో ప్రతి పేద రైతు కుటుంబానికి ఉచితంగా పాడి ఆవు తాను సొంతంగా ఇస్తానని చెప్పారు. పెద్దిరెడ్డి పాల డెయిరీ నష్టాల పాలు కాకుండా ఉండాలని ప్రభుత్వ డెయిరీలను మూత వేయించారని ఆరోపించారు. త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పాల డెయిరీలు ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా పుంగనూరును ప్రత్యేక పారిశ్రామికవాడగా తీర్చి దిద్దుతానని వివరించారు. నియోజకవర్గంలో రైల్వేలైను ఏర్పాటుకు కృషి చేస్తానని తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో మార్పు తీసుకొచ్చి అభివృద్ధితో బాటు రౌడీయిజం తరిమికొట్టడానికి భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ)ని ఆదరించాలని కోరారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రశాంత పుంగనూరు కోసం అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చెరుకు రైతు గుర్తుకు ఓట్లు వేయించాలని కోరారు. ఈఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా స్వేచ్ఛగా ఓట్లు వేసేలా కేంద్ర ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రామచంద్రయాదవ్‌ను పలు గ్రామాల్లో బీసీవై పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికి కర్పూర హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీవైపీ నాయకులు సాంబమూర్తి, హరినాథరెడ్డి, ఆనంద్, వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, పాల రమేశ్ యాదవ్, కిరణ్, ఆనందరెడ్డి, వెంకటేశ్, హరియాదవ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్26: పుంగనూరు- తిరుపతి మార్గంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చౌడేపల్లె మండలం 29ఏ చింతమాకులపల్లె పంచాయతీ పీఎల్ కొత్తూరుకు చెందిన మునిరెడ్డి కుమారుడు రాజారెడ్డి సొంత పనులపై పుంగనూరుకు వస్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. రాజారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. 108లో అతడిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు.

మామిడి తోటకు నిప్పు



పుంగనూరు రూరల్, ఏప్రిల్26: మామిడిచెట్లకు నిప్పు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు. బాధితుడు తిమ్మరాయప్ప కథనం మేరకు.. మండలంలోని వనమలదిన్నెకు చెందిన ఎం.తిమ్మరాయప్ప మామిడి మొక్కలను పెంచాడు. అయితే మేకనజామనపల్లెకు చెందిన భాగారెడ్డి, సుబ్బమ్మలు కలసి తిమ్మరాయప్ప మామిడి చెట్లకు నిప్పుపెట్టారు. చెట్లు కాలిపోయాయి. ఫిర్యాదు చేస్తే పోలీసులు తీసుకోలేదని వాపోయాడు.

నిందితుడికి రిమాండు

చౌడేపల్లె, ఏప్రిల్26: మానసిక వికలాంగురాలిపై అత్యాచారం కేసులో నిందితుడిని రిమాండుకు పంపినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 22న రాత్రి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాధితురాలిపై అదే గ్రామానికి చెందిన వెంకటరమణ ఆలియాస్ రాము (40) మద్యం మత్తులో అత్యాచారం చేశాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జనసేనలో చేరిన వలంటీర్



రామకుప్పం, ఏప్రిల్ 26: రామకుప్పం పట్టణానికి చెందిన రాజీనామా చేసిన వలంటీర్ సుబ్బు శుక్రవారం జనసేనలో చేరారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, జనసేన. టీడీపీ మండల అధ్యక్షులు హరీష్, ఆనందరెడ్డిలు ఆయనకు కుండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు.

సీతారాముల పురవిహారం

సోమల, ఏప్రిల్ 26: సోమల కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో మూల విరాట్‌లకు విశేష పూజలు జరిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామివార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. చెక్క భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపు కోలాహలంగా సాగింది. మహిళలు కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు వార్ల కవి కుటుంబ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అలాగే పత్రపల్లె ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి పుష్ప పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి

చౌడేపల్లె, ఏప్రిల్26: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని వైస్ ఎంపీపీ నరసింహరెడ్డి యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దామోదర్‌రాజు మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. కాగా మీడియాకు సైతం సమాచారం ఇవ్వకుండా సమావేశంలో నిర్వహించడంతో సమస్యల పరిష్కారం కోసం సమావేశమా లేక రాజకీయ ఎజెండా సమావేశమా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైస్‌ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో శివప్రసాద్, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, ఏప్రిల్26: భూ తగాదాకు సంబంధించిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన కె.రాజన్న కుమారుడు కదిరప్ప, అదే గ్రామానికి చెందిన రామస్వామి, కన్యాకుమారి, వెంకటేశ్, హరిలకు భూతగాదాపై కోర్టులు కేసు నడుస్తోంది. అయితే అదే భూమి కోసం మళ్లీ ఇరువర్గాలు ఘర్షణపడి పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదుచేశారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె: పుదిపట్లలో వెలసిన స్వయంభు వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

టీడీపీ పార్లమెంటు కమిటీ కార్యదర్శుల నియామకం

వెదురుకుప్పం : టీడీపీ చిత్తూరు పార్లమెంటు కమిటీలో జీడీనెల్లూరు నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి చోటు లభించింది. ఈ మేరకు చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్‌రాజన్ ప్రకటన విడుదల చేశారు. పాలసముద్రానికి చెందిన బి.ఇందిర, జీడీ నెల్లూరు మండలం కొత్తవెంకటాపురానికి చెందిన నరసింహులును నియమించారు.

రాబోయే ఎన్నికల్లో ప్రజలే గెలవాలి : భానుప్రకాష్

నగరి ఏప్రిల్26: రాబోయే ఎన్నికల్లో ప్రజలు గెలవాలని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నగరి మండలం, పట్టణ పరిధిలోని మహిళల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మహిళాసాధికారిత కోసం నాడు డ్వాక్రా గ్రూపులను ప్రారంభించారని గుర్తుచేశారు పూర్వం సామంతురాజులుండేవారని, ఆలా నగరి నియోజకవర్గంలో రోజా ఒక్కో మండలాన్ని తన అన్నదమ్ముళ్లు, భర్తకు అప్పగించి కొండలను పిండి చేసి దండుకున్నారని, ఇసుక తోడేశారని, గంజాయి అమ్మకాలతో యువత భవిష్యత్ నాశనం అయ్యేలా చేశారని విమర్శించారు. మిమ్మల్ని మీరు కాపాడుకోవాలంటే సైకిల్ గుర్తుకు ఓటేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మీరాకుమారి, కృష్ణవేణి, భానుమతి, సుజాత, సంధ్య, నాయకులు బాలాజీ, వంశీ, చిట్టి, శివకుమార్‌రెడ్డి, రమేష్, పురుషోత్తం, నారాయణ, మధు, పలువురు మహిళలు పాల్గొన్నారు.


జీఎంపురంలో మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

విజయపురం : వైసీపీని ఇంటికి సాగనంపాలని గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం గంగమాంబాపురం, కాళికాపురం, కేవీశ్రీరామాపురం, కేవీపురం ఎం.అగరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జీఎంపురంలో 20 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు పాల్గొన్నారు.

పుత్తూరు అర్బన్ : నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం 22వ వార్డు పరిధిలోని ఆరేటమ్మ కాలనీ, ఎస్‌బీఐ కాలనీలో ప్రచారం నిర్వహించారు.

తుంబకుప్పంలో 300 మంది టీడీపీలో చేరిక

బంగారుపాళ్యం, ఏప్రిల్ 26: మండలంలోని తుంబకుప్పం దళితవాడలో వంద దళిత కుటుంబాలకు చెందిన 300 మంది శుక్రవారం మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, ఎన్ఆర్ఐ విక్రమ్ చౌదరి, మండల తెలుగు యువత అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. చేరిన వారికి ఎమ్మెల్యే అభ్యర్థి మురళీ మోహన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే తిమ్మోజుపల్లె దళితవాడకు చెందిన 30 దళిత కుటుంబాలు ఎన్‌పీ ధరణి, జయచంద్రనాయుడు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. తిమ్మోజుపల్లెకు చెందిన విశ్రాంత అగ్నిమాపక అధికారి దేవేంద్ర, అతని అనుచరులు, తుంబకుప్పం మాజీ ఎంపీటీసీ కన్నయ్య, బాబ్జి, శివ, చిన్నయ్య, యశోద తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కమలనాథరెడ్డి, సుదర్శన్ నాయుడు, లోకనాథనాయుడు, హరిప్రసాద్, రవి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వైసీపీలో ఉన్న వంద కుటుంబాలను టీడీపీలో చేర్పించడానికి ఎన్ఆర్ఐ విక్రమ్‌చౌదరి విశేష కృషి చేశారు. తుంబకుప్పం దళితవాడ ప్రజలతో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే గ్రామంలో చదువుకున్న వారికి తన కంపెనీ ద్వారా ఉపాధి అవకాశాలను కల్పిస్తామని వారిలో భరోసా నింపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్

వెంకటేశ్ చౌదరికి సన్మానం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జీవీ వెంకటేశ్ చౌదరిని పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ సన్మానించారు. శుక్రవారం వెంకటేశ్ చౌదరి చిత్తూరులో ఉన్న మురళీ నివాసానానికి ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా వెంకటేశ్ చౌదరిని శాలువకప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు కన్వీనర్ దొరబాబు చౌదరి, గాలి దిలీప్‌కుమార్, పట్నం గోపి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

మే డేను విజయవంతం చేయండి : ఏఐటీయూసీ

నగరి ఏప్రిల్ 26: మే డేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోదండయ్య పిలుపునిచ్చారు. నగరి సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కోదండయ్య మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు చట్టాలుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రధానమంత్రి మోదీ వత్తాసు పలకడం దారుణమన్నారు. ఎన్నికలలో బీజేపీకి తగిన బుద్ధి చెప్పి వామపక్ష ఇండియా కూటమిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాగరాజు, ప్రేమ, చందామర్రె, గోపీనాథ్ పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్ : ఏఐటీయూసీ కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకుడు నాగరాజు మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో మణి, గోపీనాథ్, విజయ్‌కుమార్, అరుణ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఏఐటీయూసీ కార్యదర్శి కోదండయ్య

చంద్రబాబు సీఎం కావడం ఖాయం

గంగాధరనెల్లూరు టీడీపీ అభ్యర్థి థామస్

వెదురుకుప్పం/గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 26: తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కూటమి ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని, టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం కావడం ఖాయమని గంగాధరనెల్లూరు ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ వీఎం థామస్ అన్నారు. శుక్రవారం కార్వేటినగరం మండలం పద్మ సరస్సులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ గురించి వివరించారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరుస్తామని తెలిపారు. జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీలకు రెండు ఓట్లను సైకిల్ గుర్తుపైనే వేయాలని థామస్ ఓటర్లను అభ్యర్థించారు. ఆయనకు ఇంటింటా మంగళహారతులు ఇచ్చారు. పూల వర్షం కురిపించారు. గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న, టీడీపీ నేతలు రవియాదవ్, రాజేంద్రరెడ్డి, సంధాని, దాము, జనసేన నేత రాఘవ పాల్గొన్నారు.

థామస్ తొలి విజయమే
జీడీనెల్లూరు కూటమి అభ్యర్థిగా నామినేషన్ ఓకే

నామినేషన్ల పరిశీలనతో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వీఎం థామస్ పనైపోయిందని ప్రచారం చేసిన వారికి షాక్ తగిలింది. ఎందుకంటే శుక్రవారం జరిగిన పరిశీలన ప్రక్రియలో ఆయన నామినేషన్ ఆమోదం పొందింది. థామస్‌ను పోటీకి అర్హతలేకుండా చేయాలనే ప్రయత్నాలను ప్రత్యర్థులు చేపట్టారు. ఆయన పుట్టుకతో హిందూవే అయినప్పటికీ చెన్నైలో క్రిస్టియన్‌గా మారారని, ఆ ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వివిధ వర్గాల వారు ఆరోపిస్తూ వచ్చారు. జిల్లా అధికారులకూ ఫిర్యాదులు వెళ్లాయి. కోర్టును సైతం ప్రత్యర్థులు ఆశ్రయించారని ప్రచారం జరిగింది. ఎలాగైనా ఆయన నామినేషన్ చెల్లుబాటు కాకుండా చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు జరిగాయి. నియోజకవర్గంలో ఈ ప్రచారాన్ని విస్తృతం చేశారు. శుక్రవారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో అభ్యర్థి థామస్ తగిన ఆధారాలు చూపించడంతో ఆయన నామినేషన్ ఆమోదం పొందింది. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రత్యర్థులకు నోటిమాట లేకుండా చేసింది.


థామస్‌కి హారతి ఇస్తున్న మహిళలు

ముగ్గురిపై కేసు నమోదు

గుడిపాల, ఏప్రిల్ 26: పాత కక్షల కారణంగా మండలంలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నారగల్లు హరిజనవాడకు చెందిన ఆదిత్య, ఇలయన్, ఎడయన్‌లు సింగారపేటకు చెందిన నవదీప్ మధ్య పాతకక్షలు ఉండేవి. గురువారం రాత్రి కమ్మతిమ్మాపల్లె దళితవాడలో కాపుకాసి నవదీప్‌పై ఆదిత్య వర్గీయులు దాడి చేశారు. ఈ దాడిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా కుంభాభిషేకం

పాలసముద్రం, ఏప్రిల్ 26: మండలంలోని గంగమాంబాపురంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీవినాయకస్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కలశపూజ, హోమం, మహాసంకల్పం, యాత్రదానం, మహాపూర్ణాహుతి, కుంబాభిషేకం నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌కు మహా అభిషేకం చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ వేడుకల్లో గ్రామస్తులతోపాటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి వాసునాయుడు, శేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం హరికథా కాలక్షేపం నిర్వహించారు.

వైసీపీని ఇంటికి పంపండి

నింద్ర, ఏప్రిల్ 26: త్వరలో జరిగే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపాలని తెలుగు మహిళ నాయకురాళ్లు అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పేడు, ఐఆర్ కండ్రిగ, ఎంఎస్‌వీఎం పురం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలను అందిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. సైకిల్ గుర్తుపై ఓటేసి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకురాళ్లు నిరోషా, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో వైభవంగా అర్జున తపస్సు



చిత్తూరు రూరల్, ఏప్రిల్ 26: చిత్తూరు రూరల్ మండలం కృష్ణాపురంలో మహాభారత మహోత్సవం వైభవంగా జరుగుతోంది. శుక్రవారం జరిగిన అర్జున తపస్సు కార్యక్రమంలో చిత్తూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి గురజాల జగన్మోహన్ పాల్గొని పూజలు చేశారు. అర్జున తపస్సు చూసేందుకు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చారు. అర్జునుడు ఒక్కో మెట్టుకు ఒక్కో పద్యం పాడుతూ సాగిన తపస్సు ఆద్యంతం అలరించింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే గాంధీ, టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్ బాబు, వరదరాజులు నాయుడు, హనుమంతు నాయుడు, మురళి, దాము, చిట్టి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సీతారామపురంలో సూపర్ సిక్స్‌పై ప్రచారం



వడమాలపేట, ఏప్రిల్ 26: సీతారామపురం పంచాయతీ పరిధి గ్రామాల్లో శుక్రవారం మండల టీడీపీ అధ్యక్షుడు జానా వెంకటయ్య ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రచారం చేశారు. వాటి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లకే పింఛన్ ప్రకటనతో బీసీల్లో మార్పు తథ్యమని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీసీలందరూ టీడీపీని గెలిపించాలని కోరారు. నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు దేవానంద నాయుడు, ధనంజయులునాయుడు, దేవ, ఉమాపతిరావ్, భాస్కర్ నాయుడు, శోభనాద్రి యాదవ్, హరినాయుడు, వెంకటేశ్వరరావ్, గురవయ్య, పార్థసారథి నాయుడు, దిలీప్, మోహన్, మధు, వెంకటేష్, రవినాయుడు, లక్ష్మీనారాయణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిక

గుడిపాల, ఏప్రిల్ 26: మొగరాలపల్లె దళితవాడకు చెందిన జయరాజ్ శుక్రవారం మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, మాజీ సర్పంచ్ హరినాయుడు ఆధ్వర్యంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతల హరి, రవి పాల్గొన్నారు.

ఎంపీ బరిలో 21 మంది అభ్యర్థులు

27 నామినేషన్లు తిరస్కరణ ● 29వ తేది మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణ గడువు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26: చిత్తూరు (ఎస్సీ) పార్లమెంటు నియోజకవర్గ స్క్రూట్నీ ప్రక్రియ శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ అధ్యక్షతన జరిగింది. ఎన్నికల పరిశీలకులు, పోటీలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి న్యాయవాదులు, ఇతర పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు పాల్గొన్నారు. మొత్తం 56 నామినేషన్లు అందగా, వాటిలో 27 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, మిగిలిన 29 నామినేషన్లను ఆర్వో ఆమోదించారు. ఈ స్క్రూట్నీ కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి తనయుడు దగ్గుమళ్ల రాధేయ, వైసీపీ అభ్యర్థి రెడ్డెప్ప తరపున జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఇండిపెండెంట్, వివిధ పార్టీల అభ్యర్థులు పాల్గొన్నారు. శనివారం నుంచి 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణ కొనసాగుతుంది. స్క్రూట్నీ అనంతరం బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలిలా ఉన్నాయి. దగ్గుమళ్ల ప్రసాదరావు(టీడీపీ), ఎన్.రెడ్డెప్ప (వైసీపీ), మోటుకూరు జగపతి (కాంగ్రెస్), విజయ్ కుమార్ (బీఎస్పీ), జానకి రామారావు (నేషనల్ మహిళా సభా పార్టీ), పళ్ళిపట్టు అభినవ్ విష్ణు (సమాజ్‌వాది పార్టీ), ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎన్.గంగయ్య, ఎన్.చంద్రబాబు, టి.నరేష్, ఎ.పూర్ణచంద్ర, బండపల్లి రమేష్, ఎన్.భూపతి, పి.మధు, డి.మహేష్, మాదాసి సుదర్శన్, కె.మునికృష్ణ, పేట మోహన్, కె.యుగంధర్, ఇ.రమేష్, ఎస్.రవి, సి. సుధాకర్ ఉన్నారు.


స్క్రూట్నీ ప్రక్రియలో కలెక్టర్, పాల్గొన్న ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థులు

చిత్తూరులో ఏడు నామినేషన్ల తిరస్కరణ

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 26: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్ల పరిశీలన శుక్రవారం కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు అధ్యక్ష తన జరిగింది. 21మంది అభ్యర్థులు 38 నామినేషన్లు దాఖలు చేశారు. వాటిలో వివిధ కారణాలతో ఏడు నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, బరిలో 14మంది అభ్యర్థులు మిగిలారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, ఏఆర్వో శ్రీనివాసులు రెడ్డి, వివిధ పార్టీల అభ్యర్థులు, ప్రతిపాదికులు పాల్గొన్నారు. స్క్రూట్నీ అనంతరం రంగంలో మిగిలిన వారి వివరాలు... సీజీ జగన్మోహన్ (టీడీపీ), ఎంసీ విజయానంద రెడ్డి (వైసీపీ), టికారామ్ (కాంగ్రెస్), బి. లోకనాథం (బహుజన సమాజ్ పార్టీ), బికే రమణారెడ్డి (అఖిల భారతీయ జనసంఘ్), వి. సరిత (సమాజ్‌వాదీ పార్టీ), వి. రవి (జైభీమ్‌రావ్ భారత్ పార్టీ), ఎంవీ ఇందుమతి (ఇండిపెండెంట్), ఇండిపెండెంట్ అభ్యర్థులు వి. తేజస్, కె. ప్రభాకర్ రెడ్డి, కవి మోహన్ విజయ్‌కుమార్, వి. పురుషోత్తం, ములుగూరు అన్వేష్, రజియా బాషాలు మిగిలారు.

నగరి ఎమ్మెల్యే బరిలో ఏడుగురు

నగరి : నగరి ఎమ్మెల్యే స్థానానికి 24 మంది 41 నామినేషన్లు దాఖలు చేయగా 17మంది నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరించబడ్డాయి. ఏడు నామినేషన్లు మాత్రం స్క్రూటినీ అనంతరం నిలిచాయి. అందులో వైసీపీ తరపున రోజా, టీడీపీ తరపున భానుప్రకాష్, కాంగ్రెస్‌పార్టీ తరపున రాకేష్‌రెడ్డి నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున జ్ఞానప్రకాష్‌లు బరిలో నిలవగా ఇండిపెండెంట్‌లుగా ముగ్గురు వున్నారు.

గంగాధరనెల్లూరు బరిలో 12 మంది

వెదురుకుప్పం/గంగాధరనెల్లూరు : గంగాధరనెల్లూరులో శుక్రవారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ వీఎం థామస్, కాంగ్రెస్ అభ్యర్థి రమేష్‌బాబు, వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మిసహా పలువురి నామినేషన్లకు ఆర్వో సి.వెంకటశివ ఆమోదం తెలియజే శారు. వీరితోపాటు పి.భాస్కర్(బహుజన్ సమాజ్ పార్టీ), పల్లిపట్టు గుణశేఖర్ (సమాజ్‌వాది), వి.రామరాజు(అఖిల భార తీయ జనసంఘ్), ఉసురుపాటి పద్మనాభం(స్వతంత్ర), కె.కరుణశ్రీ(స్వతంత్ర), టీడీ దేవరాజ్(స్వతంత్ర), పచ్చికాపల్లం రవికుమార్(స్వతంత్ర), పులివేలమ్ మధు (స్వతంత్ర), కె.రాము(స్వతంత్ర) నామి నేషన్లను ఆమోదించారు. మొత్తం అభ్యర్థులుగా 12 మంది నిలిచారు. నామినేషన్లు తిరస్కరణకు గురైన వారిలో జై భారత్ నేషనల్ పార్టీ తరపున శేఖర్, ఆల్ ఇండియా మహిళా ఎంపవర్మెంట్ పార్టీ తరపున మురళీ, విడుదలై చిరుతైగల్ కట్చి తరపున యేసు, స్వతంత్ర అభ్యర్థి కిరణ్‌కుమార్ భార్య ఎ.కృపావతి, స్వతంత్ర అభ్యర్థిగా లేట్ గిరిబాబు భార్య ఎ.కృపావతి ఉన్నారు.

పూతలపట్టులో 7 నామినేషన్ల తిరస్కరణ

పూతలపట్టు : పూతలపట్టు నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని ఆర్వో చిన్నయ్య శుక్రవారం చేపట్టారు. ఇందులో భాగంగా ఏడు నామినేషన్లు తిరస్కరణ కాగా 12 దరఖాస్తులు ఆమోదించారు. టీడీపీ అభ్యర్థి మురళీ మోహన్, వైసీపీ అభ్యర్థి సునీల్, కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్‌బాబు నామినేషన్లను ఆమోదించారు. పరిశీలనలో భాగంగా ఎంఎస్‌బాబుకు చెందిన న్యాయవాదులు, సునీల్‌కు చెందిన న్యాయవాదుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. అనంతరం ఆర్వో జోక్యం చేసుకుని సమస్యను ఇరువురికి సర్దిచెప్పారు. తిరస్కరణకు గురైన నామినేషన్ల వివరాలు... జై మహాభారత్ పార్టీకి చెందిన గోపాల్, వైసీపీకి చెందిన పద్మావతి, టీడీపీకి చెందిన తామరకన్ను, జైభీమ్‌రావ్ పార్టీకి చెందిన శివకుమార్, అదే పార్టీకి చెందిన ఇంద్రసేన, జాతీయ జనసేన పార్టీకి చెందిన అరవింద్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నరసింగ్‌ల నామినేషన్లు సక్రమంగా లేకపోవడంతో ఆర్వో తిరస్కరించారు.

జగన్ నేరాలపై 'ఎన్డీయే కూటమి చార్జ్‌షీట్'

జగన్ పాలనలో క్షీణించిన శాంతిభద్రతలు ● ఎన్డీయే కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు



జగనాసుర రక్తచరిత్ర పోస్టర్ చూపుతున్న టీడీపీ నేతలు, ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గురజాల ప్రతిమ తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 26: సీఎం జగన్ నేరచరిత్రలపై 'ఎన్డీఏ కూటమి చార్జిషీట్' పేరుతో టీడీపీ ఉమ్మడి నేతలు పోస్టర్ ఆవిష్కరించారు. ఈమేరకు శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ హత్యారాజకీయాలకు పెట్టింది పేరు వైసీపీ అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చి జగన్ రెడ్డి సీఎం అయిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం విషయాలు పక్కన పెడితే హత్యారాజకీయాలు ఎక్కువయ్యాయన్నారు. సీఎం స్వార్థానికి, ప్రతీకార చర్యలకు ఎందరో బలయ్యారని చెప్పారు. ప్రకృతి సంపదను దోచేసుకుంటున్న వైసీపీ నేతలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ప్రశ్నించిన వారిని వేధించడం, వారిపై అక్రమ కేసులు బనాయించడం, వారిని జైలుపాలు చేయడం దారుణమన్నారు. దళిత డాక్టర్ సుధాకర్ ఉదంతమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో ఆయన నియంతృత్వ పోకడలకు, విధ్వంసానికి సంబంధించిన అంశాలను ఎన్డీయే కూటమి సేకరించి 'ఎన్డీయే కూటమి చార్జ్‌షీట్' పేరుతో కరపత్రాలను రూపొందించిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాసే జగన్‌లాంటి ముఖ్యమంత్రి రాష్ట్రానికి అవసరం లేదన్నారు. ఈ విషయాన్ని ప్రజలు ఆలోచించి, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ఎన్డీయే కూటమిని ఆదరించాలని కోరారు. కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన తమను గెలిపించి, నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసేందుకు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు చంద్రప్రకాష్, వెంకటేష్ యాదవ్, శ్రీధర్ యాదవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకోసం ప్రత్యేకంగా సూపర్ సిక్స్ పథకాలు

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు మహిళలకోసం ప్రత్యేకంగా సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించారని ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ అన్నారు. శుక్రవారం నగరంలోని 30, 31, 32 డివిజన్ల పరిధిలోని అశోకపురం, లాలూగార్డెన్, సీబీ రోడ్డు, పలమనేరు రోడ్డు, టెలిఫోన్ కాలనీ, రామ్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిమ మాట్లాడుతూ టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళా శక్తి ద్వారా 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సుగల మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా చదువుకునే పిల్లలు ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ ఏడాదికి రూ.15వేలు, దీపం పథకం కింద సంవత్సరానికి మూడు సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఇస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రమీల ఆనంద్, కోలా కిరణ్, సుధాకర్ నాయుడు, ఆనంద్, అన్సర్, భాను, చిన్ని, మున్నా, మోహన్, కమల, కిరణ్, నవీన్, మోహన్ నాయుడు, అంజలి, అరుణ పాల్గొన్నారు.

అంతర్మరణానికి మించిన చింతన లేదు

● గరికపాటి నర్సింహారావు ప్రవచనం



చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 26: ప్రతి వ్యక్తి తనలోని అంతర్మరణాన్ని జయించనాడే పరిపూర్ణ వ్యక్తులు అవుతారని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నర్సింహారావు అన్నారు. శుక్రవారం నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు నారాయణి సేవాసమితి ఆధ్వర్యంలో భక్తచింతామణి శతకంపై ఆయన ప్రవచనాలు చేసారు. కేవలం పురణాలు, పౌరాణికాలు విన్నంత, చదివినంత మాత్రన వ్యక్తులు విజ్ఞానవంతులు కాలేరని, వాటిని ఆదర్శంగా ఉపయోగించి కాలాను గుణంగా జీవిస్తేనే వారు పరిపూర్ణులౌవుతారు అని ప్రవరించారు. వ్యక్తులు యవ్వనం నుంచి ముసలి ప్రాయం వచ్చేంత వరకు రక్తి-భక్తి-భుక్తి-ముక్తులకు ప్రాకులాడతారని, వాటితోనే రాగద్వేషాలు పెంచుకుంటారన్నారు. వీటన్నిటితో కూడుకున్నదే ప్రముఖ ఆధ్యాత్మిక సహజకవి వడ్డాది సుబ్బరాయ కవి భక్తచింతామణి శతకం రాసారని, అది నేటి సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భక్తచింతామణి అంటే చింతలతో కూడుకున్న జీవితాన్ని జయించిన విధానం అని ప్రవరించారు. నారాయణి ట్రస్టు డైరెక్టర్ బాలాజి, పీఆర్వో కళ్యాణచక్రవర్తి, చిరంజీవి, డాక్టర్ ఎర్రయ్య, ఎం.ఆర్, అరుణకుమారి దంపతులు, పార్థసారథినాయుడు పాల్గొన్నారు.

విజయపురంలో శ్రీరాముడి వసంతోత్సవం



విజయపురం, ఏప్రిల్ 26: మండల కేంద్రమైన విజయపురంలో శుక్రవారం శ్రీరాముడి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. మేళతాళ, మంగళవాయిద్యాలతో శ్రీరాముడిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ గ్రూపు విద్యా సంస్థల అధినేత అశోకరాజు, ఇందిరవేణి దంపతులు, ఆలయ పూజారి వందవాసి మహేష్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం

వడమాలపేట, ఏప్రిల్ 26: రాష్ట్రంలో సుస్థిరత సాధించాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని నగరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాకేష్ రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్ , నాయకులు పురుషోత్తం రెడ్డి, చిరంజీవి, రత్నం, కేశవులు, కుమార్, దివాకర్ పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 26: వేసవి సెలవుల్లో ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీవైఈవో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈనెల 24 నుంచి వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ఏ ప్రైవేటు పాఠశాల తరగతులు నిర్వహించరాదని, నిబంధనలు అతిక్రమించిన పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

జేవీవీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ

చిత్తూరు(సెంట్రల్),ఏప్రిల్26:మిట్టూరులోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో వేసవి శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు పర్యవరణ విభాగం కన్వీనర్ సుధాకర్ తెలిపారు. చెస్‌పై విద్యార్థులకు అవగాహన, మేధాశక్తి పెంపు, ఏకాగ్రత, డ్రాయింగ్, ఇండోర్ గేమ్స్ తదితర వాటిని నిర్వహించనున్నట్లు తెలిపారు. మే ఒకటి నుంచి విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అరుణశివ కుమార్, గిరిధరమూర్తి, విజయ్ కుమార్, రాజశేఖర్, విజయ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



బంగారుపాళ్యం, ఏప్రిల్ 26: స్థానిక బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద శుక్రవారం 170 గొల్లపల్లికి చెందిన సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వాసుదేవ నాయుడు సతీమణి రాజేశ్వరి వర్ధంతి సందర్భంగా పేదలకు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్ర నాయుడు, సురేంద్ర నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, కమల్‌నాథ రెడ్డి, జనార్దన్ గౌడ్, నవీన్ చౌదరి పాల్గొన్నారు.